శనివారం
18-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 146
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

75 శాతం 'ప్రైవేటు' కోటా చట్టం రద్దు

చండీగఢ్: ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకు 75శాతం కోటా రాజ్యాంగ విరుద్ధమని పంజాబ్-హరియాణా హైకోర్టు వెల్లడించింది. దీనిపై చట్టాన్ని రద్దు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 19లను ఈ చట్టం ఉల్లంఘించిందని పేర్కొంది. రూ.30వేల కంటే తక్కువ జీతాలు వచ్చే ఉద్యోగాల్లో స్థానికులకు 75 కోటా నిర్ణయం పారిశ్రామిక రంగానికి నష్టంతోపాటు పెట్టుబడులను ప్రభావితం చేస్తున్నట్లు ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లను ప్రైవేటు సంస్థలు దాఖలు చేశాయి. హైకోర్టు విచారణ 90 సెకన్లలోనే పూర్తి చేసిందంటూ గతంలో సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించింది.

హక్కుల కోసం
సంఘటిత పోరు

- 2024 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి
- మహిళలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలి
- నంద్యాల బహిరంగ సభలో అక్కినేని వనజ పిలుపు

విశాలాంధ్ర - నంద్యాల: మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) జాతీయ నాయకులు అక్కినేని వనజ విమర్శించారు. హక్కుల సాధన కోసం మహిళలు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్లను 2024 సార్వత్రిక ఎన్నికల నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలు శుక్రవారం నంద్యాలలో ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభసూచకంగా పట్టణంలో మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రముఖ పార్లమెంటేరియన్, మహిళా రిజర్వేషకు ఆద్యులు

- మిగతా 2 లో

కదం తొక్కిన మహిళలు

- కోలాటాలతో మహిళా సమాఖ్య భారీ ప్రదర్శన
- ప్రజానాట్య మండలి డప్పుచప్పులతో మార్మోగిన వీధులు

2లో

బొగ్గు దిగుమతుల్లో
అదానీ అక్రమాలు

- మార్కెట్ ధర కంటే రెట్టింపునకు కొనుగోళ్లు
- ఇంధన ధరలు, విద్యుత్ చార్జీలపై ప్రభావం
- ప్రశ్నించే నేతలు, పాత్రికేయులపై చర్యలు
- మోదీతో సంబంధాలపై ప్రశ్నలు
- కోట్లాది భారతీయుల జేబులు గుల్ల : కాంగ్రెస్

న్యూదిల్లీ: బొగ్గు దిగుమతుల్లో అదానీ సంస్థ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మార్కెట్ ధర కంటే రెట్టింపునకు కొనడంతో ఇంధనం ధరలను ప్రభావితం చేయడమే కాక విద్యుత్ చార్జీల మోతకు కారణంగా నిలుస్తోంది. అదానీ అక్రమాలను ప్రశ్నించే నేతలు, పాత్రికేయులపై చర్యలతో మోదీ-అదానీ మధ్య దోస్తీ, మోదీ హయాంలో అదానీ సంపద, హోదా అమాంతం పెరిగిపోవడంపై అనేక ప్రశ్నలు వస్తున్నాయి. కోట్లాది మంది భారతీయుల జేబులను అదానీ గుల్ల చేస్తున్నారని విపక్షాలు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తుండటం, రక్షణ కోసం జర్నలిస్టులు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వస్తుండటంతో

'మోదానీ' అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గతంలో హిండెన్‌బర్గ్ ఇటీవల ఫైనాన్షియల్ టైమ్స్ వెలువరించిన నివేదికలతో అదానీ సంస్థ అక్రమాల గుట్టు రట్టు అయింది. లండన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ సమగ్ర దర్యాప్తు జరిపి అదానీ అక్రమాలను బయట పెట్టింది. బొగ్గు దిగుమతుల విలువను అధికంగా చూడటం ద్వారా ఇంధన

- మిగతా 2 లో

కాంగ్రెస్ 'అభయహస్తం'

- మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలతో పాటు 62 అంశాలు
- తెలంగాణలో అధికారం చేపడతాం
- త్వరలో కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామనే విషయం పై స్పష్టత ఇస్తూ అభయ హస్తం పేరుతో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. గతంలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు అనుబంధంగా మరో 62 అంశాలను జోడిస్తూ... మొత్తం 42పేజీలతో కూడిన ఎన్నికల మేనిఫెస్టోను శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖడ్గే గాంధీభవన్‌లో విడుదల చేశారు. తెలంగాణకు అవసరమైన అన్ని అంశాలు ఇందులో ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేణుగోపాల్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే తదితర తెలంగాణ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖడ్గే మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వారిని ఆదుకునే

- మిగతా 2 లో

పోలీసు బోర్డు నిర్లక్ష్యం

- ఎస్ఐ నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే
- బాధితులకు ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్ఐ నియామకాల్లో భౌతిక కొలతల వ్యవహారం బెడిసికొట్టింది. ఈ నియామక ప్రక్రియలో భాగంగా ఎత్తు అంశంపై కొందరు బాధితుల పిటిషన్‌తో ఎస్ఐ పోస్టుల నియామక నోటిఫికేషన్‌పై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. ఈ స్టేతో బాధితులు ఊరట చెందారు. సుదీర్ఘకాలం నుంచి సాధన చేసి...ఎస్ఐ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులు నిరాశ చెందారు. ఎస్ఐ నియామకాలకు సంబంధించి ఎత్తు అంశంలో అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, గతంలో అర్హులైన వారందరినీ ప్రస్తుత నోటిఫికేషన్ ప్రక్రియలో అనర్హులుగా ప్రకటించారని బాధితులు హైకోర్టులో పిటిషన్ వేశారు. బాధితుల తరపున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీ ఎస్ఎల్ పీఆర్‌బీ) ద్వారా 6100 కానిస్టేబుళ్లు, మరో 411 ఎస్ఐ ఉద్యోగాల భర్తీకి గతేడాది నవంబరు 28న నోటిఫికేషన్ జారీజేశారు. మొత్తం 315 ఎస్ఐ పోస్టులు, మరో 96 రిజర్వుడు సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులున్నాయి. నాలుగు జోన్లలో 315

- మిగతా 2 లో

డిసెంబరులో
బ్యాంకుల సమ్మె

- 4 నుంచి 11 వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు
- జనవరి 2 నుంచి 6 వరకు రాష్ట్రాల వారీగా
- 19,20 తేదీల్లో అఖిలభారత సమ్మె : ఏఐబీఈఏ

చెన్నై: దేశంలోని అన్ని బ్యాంకుల్లో సముచిత నియామకాలు చేపట్టాలని, శాశ్వత ఉద్యోగాల ఔట్‌సోర్సింగ్ ఉండరాదన్న డిమాండ్లతో అఖిలభారత బ్యాంకుల సమ్మెకు అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) పిలుపునిచ్చింది. తమ సమస్యల పరిష్కారం, సదుపాయాల కల్పనను డిమాండ్ చేస్తూ దశలవారీ పోరునకు నడుం బిగించింది. ఇదే క్రమంలో డిసెంబరు, జనవరి నెలల్లో అఖిలభారత సమ్మెలతో పాటు బ్యాంకులవారీ, రాష్ట్రాలవారీ సమ్మెలకు సిద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ఉద్యోగులంతా డిసెంబరు 4 నుంచి జనవరి 20వ తేదీ వరకు సమ్మె చేయనున్నట్లు ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం తెలిపారు. 'డిసెంబరు 4న పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), పంజాబ్&సింధ్ బ్యాంక్, ఎస్‌బీఐ సమ్మెబాట పడతాయి. దీంతో అఖిల భారత సమ్మె ప్రారంభమవుతుంది. డిసెంబరు 5న బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, 6న కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 7న ఇండియన్ బ్యాంక్, యూసీఓ బ్యాంక్, 8న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సమ్మె చేయనున్నాయి. డిసెంబరు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కమ్యూనిస్టు నేతల అరెస్టు
దుర్మార్గం

ప్రభుత్వ తీరుపై రామకృష్ణ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూజివీడు పర్యటన సందర్భంగా కమ్యూనిస్టుపార్టీ నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకొని సీపీఐ నాయకులు చలసాని వెంకట రామారావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల

- మిగతా 2 లో



ప్రజలతోనే నా పొత్తు

- దొంగల ముఠా అబద్ధాలు నమ్మొద్దు
- రైతులకు భూపంపిణీపై పెత్తందారులకు ఆగ్రహం
- నూజివీడు బహిరంగ సభలో సీఎం జగన్

2లో

రానున్న ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకునేది లేదని, ప్రజలతోనే తన పొత్తు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు.

చెదురుమదురు ఘటనలు మినహా
పోలింగ్ ప్రశాంతం

మధ్యప్రదేశ్‌లో 71 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 68 శాతం పోలింగ్

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ నియోజకవర్గాలకు, ఛత్తీస్‌గఢ్‌లో 70 స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగింది.

8లో

కలిసికట్టుగా సవాళ్లు అధిగమించగలం

అపెక్ సదస్సులో జిన్‌పింగ్

శాన్‌ఫ్రాన్సిస్కో: కలిసికట్టుగా సవాళ్లను అధిగమించడం ద్వారా ఆసియా-పసిఫిక్‌లో కొత్త అధ్యాయం లిఖితమవుతుందని అపెక్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. ఆసియా-పసిఫిక్ నేతలు మూడు దశాబ్దాల కిందట శాంతి-అభివృద్ధి పంథాను అనుసరించేవారని, అపెక్ ఎకనామిక్ లీడర్స్ సదస్సుకు శ్రీకారం చుట్టారని రాతపూర్వక ప్రసంగంలో జిన్‌పింగ్ గుర్తుచేశారు. ఆసియా-పసిఫిక్ అభివృద్ధి, ఆర్థిక ప్రపంచీకరణ కసరత్తు మొదలైందని, ప్రపంచ సుస్థిరాభివృద్ధికి, ఆర్థిక వృద్ధికి పవర్‌హౌస్‌గా ఆసియా-పసిఫిక్ మారిందన్నారు. 'ప్రాంతీయతావాదానికి మూడు దశాబ్దాలుగా కట్టుబడి ఉన్నాం, పరస్పర శక్తి సామర్థ్యాల ద్వారా అవసరాలకనుగుణంగా ఒకొరికోసం ఒకరం నిలిచాం, సహాయ సహకారాలు అందించుకున్నాం, అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించాం. నేడు ప్రపంచం మార్పు-ఒత్తిళ్ల కాలంలోకి అడుగు పెట్టింది. అపెక్ వ్యవస్థాపక మిషన్‌కు నిబద్ధులై ఉండాలి. మిషన్‌ను గమనంలో ఉంచుకోవడం ముఖ్యం. సవాళ్లభరిత కాలంలో ఆసియా-పసిఫిక్ సహకారాన్ని మళ్లీ పునరుద్ధరించుకోవడం అవసరం. మరో 30 ఏళ్ల ఆసియా-పసిఫిక్ సహకారాన్ని పెంపొందించుకోవడం కీలకం' అని జిన్‌పింగ్ అన్నారు. ఐరాస చార్టర్ సిద్ధాంతాలకు కట్టుబడాలని, డిజిటల్, గ్రీన్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహించాలని, సృజనాత్మకతను పెంపొందించాలని సూచించారు. ప్రపంచ పాలనను మెరుగుదలకు, స్వేచ్ఛ, పారదర్శక, నిష్పాక్షిక వాతావరణం సృష్టికి, శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధికి ఉమ్మడిగా కృషి చేయడం అవసరమని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

గాజాకు మళ్లీ ఆగిన సాయం

జెనీవా/జెరూసలేం: ఆకలిదప్పికలతో అల్లాడిపోతున్న పలస్తీనా ప్రజలకు అందించే మానవతా సాయానికి మళ్లీ గండి కొట్టారు. ఇంధనం లేక సంప్రదింపులు తెగిపోవడం వల్ల గాజాకు చేరాల్సిన ఐరాస సహాయ సామాగ్రి శుక్రవారం సరఫరా కాలేకపోయింది. దీంతో వేలాది మంది నిస్సహాయ పలస్తీనా ప్రజల వెతలు మరింత పెరిగాయి. ఇజ్రాయిల్ దళాలు వైమానిక, భూతల దాడులతో గాజాను శిథిలం చేస్తున్నాయి. అతిపెద్ద ఆసుపత్రి అల్ షిఫాపై దాడులతో అక్కడున్న వేలాది మంది ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లజేశాయి. ఇప్పుడు సాయం కూడా అందకపోవడం పలస్తీనియన్లను కలవరపాటుకు గురిచేస్తోంది. మనుగడ సాగించడం వారికి సవాల్‌గా మారుతోంది. ఆహారం లేక ఆకలిచావులు పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పీ) హెచ్చరించింది. గాజా స్ట్రిప్, ఈజిప్టు మధ్య రఫా సరిహద్దును దాటుతున్న వారిపై ఇజ్రాయిల్ దాడి చేయడంలో భారీ సంఖ్యలో పలస్తీనియన్లు మృత్యువాత పడినట్లు పలస్తీనా వార్తాసంస్థ డబ్ల్యుఏఎఫ్‌ఏ నివేదించింది. ప్రాథమికంగా తొమ్మిది మంది చనిపోగా అనేక మందికి గాయాలైనట్లు సమాచారం అందినట్లు అల్ జజీరా పేర్కొంది.

గాజాలో ప్రబలుతున్న వ్యాధులు: డబ్ల్యుహెచ్ఓ

గాజాలో ఇజ్రాయిల్ భీకర దాడులతో ప్రజలంతా శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఎక్కువ మంది ఒకే చోట ఉండటంతో పారిశుద్ధ్యం సమస్యగా మారింది. మరోవైపు ఆహారం, స్వచ్ఛమైన మంచినీళ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో గాజాలో వ్యాధులు ప్రబలుతుండటం ఆందోళనకరంగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) శుక్రవారం ఆవేదన వ్యక్తం చేసింది. శీతాకాలం మొదలవుతున్న సమయంలో ఈ విధంగా వ్యాధులు ప్రబలుతుండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని డబ్ల్యుహెచ్ఓ అధికారి రిచర్డ్ పీపర్‌కార్న్ పేర్కొన్నారు. తీవ్రమైన శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్ల కేసులు 70వేలకుపైగా నమోదు కాగా డయేరియా కేసులు 44వేలకుపైగా ఉన్నట్లు వెల్లడించారు.

కమ్యూనిస్టు నేతల అరెస్టు దుర్మార్గం

(మొదటి పేజీ తరువాయి)

వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి సీహెచ్ పుల్లారావులను ముందు రోజు రాత్రే గృహనిర్బంధం చేశారు. వీరితోపాటు సీపీఎం నాయకులు జి. రాజు తదితరులను గృహ నిర్బంధంలో ఉంచారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులను గృహ నిర్బంధం చేసి... పేదలకు భూమి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించటం సీఎం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని రామకృష్ణ విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ నూజివీడు తాలూకాలో సుదీర్ఘకాలం పోరాటం చేసి...భూమిలేని పేదలను సమీకరించి ప్రభుత్వ బంజరు భూములను, అటవీ బంజరు భూములను 30 వేల ఎకరాలు పంపిణీ చేసింది. కమ్యూనిస్టు పార్టీ పంపిణీ చేసిన ఆ భూములకు 1969-70 ప్రాంతాలలో 15 ఎకరాలకు పైగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అసైన్డు పట్టాలు మంజూరు చేసింది. ఆ తరువాత కాలంలో కమ్యూనిస్టు పార్టీ భూపోరాటాలు నిర్వహించి తాలూకాలోని 40 గ్రామాలలో 30 వేల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేసింది. వీటిలో అత్యధిక భాగం భూములను పేదలు నేటికీ అనుభవిస్తున్నారని రామకృష్ణ గుర్తు చేశారు. అటువంటి కమ్యూనిస్టు పార్టీ నాయకులను గృహ నిర్బంధంలో ఉంచి ప్రభుత్వం భూమి పంపిణీ చేయడం దుర్మార్గమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రవ్యాప్తంగా అనేక భూ పోరాటాలు నిర్వహించి ఆంధ్రలో పది లక్షల ఎకరాలు, తెలంగాణలో పది లక్షల ఎకరాల బంజరు భూములు, సీలింగు భూములను పేదలకు పంపిణీ చేసిందని ఇది చరిత్ర తెలిపిన సత్యమని రామకృష్ణ గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అసైన్డు కమిటీలను నియమించలేదని, ఒక్క ఎకరం భూమి కూడా పేదలకు పంపిణీ చేయలేదన్నారు. గతంలో తాము పంచిన భూములకు పట్టాలు ఇస్తూ, తామే భూమి పంపిణీ చేశామని గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. నూజివీడు తాలూకా చరిత్రలో కమ్యూనిస్టుల పోరాటాన్ని విస్మరించి భూమి పంపిణీ చేశామని ఎవరు చెప్పినా అది చరిత్రను వక్రీకరించడమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఏ గ్రామంలో ఎన్ని ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిందో బహిరంగంగా చెప్పటానికి సిద్ధంగా ఉన్నామని, కమ్యూనిస్టు పార్టీ భూ పోరాటాల ద్వారా భూమి పంపిణీ చేసిన చరిత్ర తెలిసి ఉన్న స్థానిక ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సైతం కమ్యూనిస్టుల కృషిని ప్రశంసించకపోగా, కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేయించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇంకా పట్టాలు లేని 10 వేల ఎకరాల అటవీ బంజర భూములకు పట్టాలు ఇచ్చేందుకు పూనుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

గ్రీస్ పాలిటెక్నిక్ తిరుగుబాటుకు 50 ఏళ్లు

ఏథెన్స్: గ్రీస్‌లో సైనిక నియంత పాలనకు చరమగీతం పాడిన పాలిటెక్నిక్ తిరుగుబాటుకు శుక్రవారానికి 50ఏళ్లు అయ్యాయి. 1973లో ఈ తిరుగుబాటు జరిగింది. అప్పట్లో 20వ శతాబ్దపు గ్రీస్ శ్రామిక పోరాటం కీలక ఘట్టంగా నిలిచింది. 1967 ఏప్రిల్ 20-21వ తేదీ మధ్య రాత్రి అమెరికా, నాటో అనుబంధ దళాలు తిరుగుబాటు చేశాయి. 1967 మేలో సుమారు 40 వేల మంది కమ్యూనిస్టులు అరెస్టుకు గురయ్యారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ), యునైటెడ్ డెమొక్రేటిక్ లెఫ్ట్ (ఈడీఏ) నాయకులు అగ్రభాగాన నిలిచి పోరాడారు. అప్పట్లో ప్రోమేథేసెస్ అనే కోడ్‌పేరుతో చేపట్టిన ఆపరేషన్‌లో క్రియాశీలంగా వ్యవహరించిన కల్నల్స్ జి.పపాడోపౌలస్, ఎన్.మకారేజెస్‌ను 'ది బ్లాక్ కల్నల్స్'గా పిలిచేవారు. ప్రజలను మోసం చేసేందుకు కల్నల్స్ తమ తిరుగుబాటుకు 'జాతీయ విప్లవం'గా పేరు పెట్టారు.

గ్రీక్ సమాజంలోని వర్గాల ప్రయోజనాల కోసం ఈ పోరు అన్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశారు. సైన్యం ముఖ్యంగా అధికారులను ఈ తిరుగుబాటునకు చోదకశక్తిగా ప్రచారం చేశారు. కమ్యూనిజానికి వ్యతిరేకంగా పోరాటమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రజలతోనే నా పొత్తు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: రానున్న ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకునేది లేదని, ప్రజలతోనే తన పొత్తు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఏలూరు జిల్లా నూజివీడులో 46,463.82 ఎకరాలకు సంబంధించి 42,307 మందికి డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. స్థానిక శాసనసభ్యుడు మేక వెంకట ప్రతాప్ అప్పారావు అధ్యక్షతన జరిగిన జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ పేదల పట్ల తమ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తుంటే ప్రతిపక్షం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 17,406 గ్రామాలకుగాను మొదటిదశలో ఏకంగా 4 వేల గ్రామాలలో రీ సర్వే కార్యక్రమం విజయవంతం చేశామని, మరోవిడతగా రెండువేల గ్రామాలలో పూర్తిచేసి, నేటి నుండి మూడో విడత కార్యక్రమం ప్రారంభిస్తున్నామని తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల సచివాలయాలలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. సర్వే ద్వారా భూ తగాదాలకు పరిష్కారం చూపిస్తూ రికార్డులలో ఎక్కించామని చెప్పారు. అసైన్డ్ భూములకు భూ హక్కులు కల్పిస్తున్నామని, చుక్కల భూములకు సైతం పరిష్కారం చూపించామన్నారు. స్మశాన వాటికలు లేని దళితవాడల కోసం 1,563 గ్రామాలలో 951 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించామన్నారు. 20 ఏళ్లకు పైగా అసైన్డ్ భూములు సాగుచేసుకుంటున్న పేద రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించామన్నారు. చుక్కల భూములను నిషేధిత జాబితా నుండి తొలగించామన్నారు. దీనివలన 1.2 లక్షల మంది రైతులకు మేలు జరిగిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల ద్వారా కొనుగోలు చేసుకున్న భూములపై హక్కులు కోల్పోయిన రైతులకు రాష్ట్రవ్యాప్తంగా 22,387 ఎకరాలను 22,346 మంది దళితులకు పంపిణీ చేశామని, వీటిని కూడా 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి పూర్తి హక్కులు కల్పించామన్నారు. కొండ ప్రాంతాలలో నివాసం ఉంటున్న గిరిజనులు సాగు చేసుకుంటున్న 1,56,655 గిరిజన కుటుంబాలకు 3,26,982 ఎకరాలు పంపిణీ చేపట్టామన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు రుణాలు మాఫీ చేస్తానని నమ్మించి మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబు ప్రజాభిమానంతో ఏనాడు గెలవలేదని, పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారని, రెండోసారి కార్గిల్ యుద్ధం కారణంగా సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. మూడోసారి ప్రజలకు మాయమాటలు చెప్పి ఇంద్రలోకం చూపించి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. 2019 ఎన్నికలలో ఇచ్చిన తీర్పుని పునరావృతం చేసి రాబోయే ఎన్నికలలో తనను గెలిపించాలని కోరారు. రాబోయే రోజులలో మోసాలు ఎక్కువవుతాయని, గజదొంగల ముఠా, దత్తపుత్రుడు ఏకమై ప్రజలను మోసం చేసేందుకు అడుగులు వేస్తారని, దీనిని గమనించి ప్రజలు మోసపోవద్దని సూచించారు. వైసీపీ ప్రభుత్వం వలన మేలు జరిగితే తనకు సైనికుల లాగా అండగా నిలబడాలని కోరారు. సభలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, హోంమంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల జడ్‌పీ చైర్‌పర్సన్లు ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఉప్పల హారిక, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య, దూలం నాగేశ్వరరావు, పుప్పాల శ్రీనివాసరావు, తెల్లం బాలరాజు, కొఠారు అబ్బయ్య చౌదరి, ఉన్నమట్ల ఎలీజా, తలారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరులో బ్యాంకుల సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

11న అన్ని ప్రైవేటు బ్యాంకులు అఖిలభారత సమ్మె చేస్తాయి. 2024, జనవరి 2 నుంచి రాష్ట్రాల వారీగా సమ్మె జరుగుతుంది. జనవరి 2న తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, పుదుచ్చేరి, అండమాన్ & నికోబార్, లక్షద్వీప్‌లోని బ్యాంకుల ఉద్యోగులు సమ్మె చేయనున్నారు. అలాగే, జనవరి 3న గుజరాత్, మహారాష్ట్ర, గోవా, దాదర్, దామన్ దయ్యూలో, జనవరి 4న రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో, 5న దిల్లీ పంజాబ్, హరియాణా, జమ్ముకశ్మీర్, లఢక్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో, 6న పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్, జార్ఖండ్, అసోం, త్రిపుర, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు సమ్మె చేయనున్నారు. ఇదిలావుంటే జనవరి 19, 20 తేదీల్లో రెండు రోజుల అఖిలభారత సమ్మెకు అన్ని బ్యాంకులు దిగనున్నాయి' అని ఏఐబీఈఏ ప్రకటన పేర్కొంది.

కాంగ్రెస్ 'అభయహస్తం'

(మొదటి పేజీ తరువాయి)

విధంగా కాంగ్రెస్ మేనిఫెస్టో రూపొందించిందన్నారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని... ఎప్పుడూ ఫాంహౌస్‌లోనే ఉండే కేసీఆర్... మున్ముందు కూడా అక్కడే ఉండిపోతారన్నారు. త్వరలోనే ప్రజలు బైబై కేసీఆర్... టాటా కేసీఆర్ అంటారని తెలిపారు. గత కొన్ని రోజులుగా కేసీఆర్‌లో ఓటమి భయం కనిపిస్తోందని... అయన గొంతులో కూడా ఆందోళన చాలా స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ కలిసి ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, ఈవిషయంలో ప్రజలు ఇప్పటికే డిసైడ్ అయిపోయారన్నారు. విద్యార్థులు, ఉద్యోగుల బలిదానాలు చూసి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, ప్రజలు బాగు పడతారని తెలంగాణ ఇస్తే... నేడు ప్రజలను దోచుకునే వాళ్లు రాజ్యమేలుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టులు, పథకాలు, ప్రతి దాంట్లోనూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కర్నాటకలో ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లే ఇక్కడా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కర్నాటకలో చెప్పిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నామని... అదేవిధంగా రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను బరాబర్ అమలు చేసి తీరతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేబినెట్ ఏర్పాటైన తొలి రోజే వాటిపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల మేనిఫెస్టోనే భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటిదన్నారు. తెలంగాణ ప్రజలకు ఈ మేనిఫెస్టోను అంకితం చేస్తున్నామని చెప్పారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాలరాశారని... పదేళ్లు అవకాశం ఇస్తే ధనిక రాష్ట్రాన్ని దివాళా తీయించారన్నారు. నమ్ముకున్నవారికి ద్రోహం చేసి పదేళ్లలో అహంకారపూరిత పాలనను తెలంగాణ ప్రజలు చవిచూశారన్నారు. నేడు వెనక్కి తిరిగి చూసుకుంటే పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు ప్రజల పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ స్ఫూర్తి నింపారని త్వరలో తెలంగాణలో కాంగ్రెస్ తుపాను రాబోతోందన్నారు. మార్పు కావాలి...కాంగ్రెస్ రావాలి అనే నినాదంతో ప్రజలు ముందుకొచ్చారని, కేసీఆర్ కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మేనిఫెస్టోలోని కీలక అంశాలు

- ఉద్యోగ నియామకాలకు జాబ్ క్యాలెండర్, మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాల్ని భర్తీ చేసేలా చర్యలు.
- ఫిబ్రవరి 1 నుంచి జూన్ 1 వరకూ గ్రూప్ ఉద్యోగాల నోటిఫికేషన్. జూన్2న నోటిఫికేషన్.. సెప్టెంబరు 17 లోపు ఉద్యోగాల భర్తీ
- నిరుద్యోగుల కోసం యూత్ కమిషన్ రూ. 10లక్షల వడ్డీ లేని రుణం
- నిరుద్యోగ యువతకు నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి
- దళిత, గిరిజనులకు మేలు చేకూర్చే చర్యలు
- రైతులకు 24గంటలు ఉచిత కరెంట్.
- కాళేశ్వరం ముంపు బాధితులకు సాయం. ముంపు నివారణకు కరకట్టల నిర్మాణం.
- రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, 3 లక్షల వరకూ వడ్డీ లేని రుణం
- విత్తనాలు, ట్రాక్టర్లు, ఎరువులు కొనుగోలుపై సబ్సిడీ
- రైతులు, కౌలు రైతులకు ఏడాదికి రూ. 15వేలు ఆర్థిక సాయం
- రైతు కూలీలకు రూ. 12వేలు ఆర్థిక సాయం
- అన్ని పంటలకు మద్దతు ధర
- చక్కెర కర్మాగారాలు తెరవడం, పసుపు బోర్డు ఏర్పాటు

పోలీసు బోర్డు నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌ఐ పోస్టుల భర్తీకి బోర్డు ప్రకటన జారీజేసింది. ఇందులో జోన్ 1లో 50, జోన్ 2లో 105, జోన్ 3లో 55, జోన్ 4లో 105 చొప్పున కేటాయించింది. బోర్డు షెడ్యూలు ఆధారంగా ఈ ఏడాది మార్చిలో ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హతసాధించిన ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలి. ఆ సమయంలో రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో వాటిని వాయిదా వేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 1వ తేదీ నుంచి 25 వరకు విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు, ఏలూరు రేంజ్‌లో అర్హులైన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరిపారు. అక్టోబరు 14, 15 తేదీల్లో ప్రధాన పరీక్షలకు షెడ్యూలు కేటాయించింది. దీంతో దేహదారుఢ్య పరీక్షల సన్నద్ధతకు అతి తక్కువగా కేవలం 20 రోజుల గడువు విధించడంపై అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారు.

ఎత్తు కొలిచే సెన్సార్ లోపం

2018లో ఎస్‌ఐ నియామకాలకు నిర్వహించిన ఈవెంట్లలో ఎత్తులో అర్హత సాధించి ఉద్యోగాలకు చాలా మంది ఎంపిక కాలేదు. దీంతో 2022 నోటిఫికేషన్‌లో వారు మళ్లీ ఎస్‌ఐ ఈవెంట్లకు హాజరు కాగా, ఎత్తు కొలిచే సెన్సార్ వల్ల ఈ దఫా అర్హత కోల్పోయినట్లు వాపోతున్నారు. ఒకే మిషను రెండు రకాలుగా చూపడం వల్ల అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, దీనిపై సమీక్షించాలంటూ కొంతమంది అభ్యర్థులు ప్రభుత్వానికి, పోలీస్ బోర్డుకు విన్నవించినా ఫలితం లేదు. ఇదే అంశంపై ప్రతిపక్ష పార్టీలు సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాయి. ప్రభుత్వం, నియామక బోర్డు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. గతంలో ఎత్తు కొలిచే సెన్సార్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు...ఈ ఏడాది అనర్హులుగా ఎలా మారతారని ప్రశ్నించారు. ఇదే అంశంతో బాధిత అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. దీనిపై హైకోర్టు విచారించి గతంలో అర్హులైన అభ్యర్థులు, ఇప్పుడు అనర్హులు ఎలా అవుతారని పోలీసు నియామక బోర్డును సూటిగా ప్రశ్నించింది. ఈ నియామకాన్ని నిలుపుదల చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరగా, అందుకు హైకోర్టు ఏకీభవించి ఎస్‌ఐ నోటిఫికేషన్‌పై స్టే విధించింది. ఈ లోపాలపై పోలీసు బోర్డు ముందస్తుగానే సరిదిద్ది ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ స్టే వల్ల కొంతమంది బాధితులకు న్యాయం జరగగా, అర్హులైన వారికి నిరాశ మిగిలిచ్చింది. అటు ఎస్‌ఐ ప్రిలిమ్స్ పరీక్షల్లో చాలా ప్రశ్నలు తప్పుగా ఉన్నాయని అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. మొత్తంగా ఈ నియామకాల ప్రక్రియలో పారదర్శకత లోపించినట్లు విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఆయా అంశాల్ని పోలీసు నియామక బోర్డు గుర్తించి, భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

బొగ్గు దిగుమతుల్లో అదానీ అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

ధరతో పాటు విద్యుత్ చార్జీలను ప్రభావితం చేస్తున్నట్లు అదానీ సంస్థపై ఆరోపణలు వచ్చాయి. దేశంలోని అతిపెద్ద ప్రైవేటు బొగ్గు దిగుమతిదారు సంస్థగా ఉన్న అదానీ... ఇంధనం ధరలను పెంచేందుకు అధిక ధరకు బొగ్గు దిగుమతులు చూపుతున్నదని, తద్వారా విద్యుత్ వినియోగానికి పౌరులు అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తోందని ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక పేర్కొంది. 2019 నుంచి 2021 మధ్య డేటాతో ఈ నివేదికను వెలువరించింది. 'తైవాన్, దుబాయి, సింగపూర్‌లోని ఆఫ్‌షోర్ కంపెనీల ద్వారా ఐదు బిలియన్ల విలువైన బొగ్గును మార్కెట్ ధరకు రెట్టింపుకంటే ఎక్కువకు అదానీ కొనుగోలు చేశారు. ఈ క్రమంలో బొగ్గు ధర 70 మిలియన్ డాలర్లకుపైగా పెరిగింది' అని పేర్కొంది.

అయితే సింగపూర్ నుంచి ఆధారాలు సేకరించకుండా అధికారులను ఆపేందుకు అదానీకి కిందిస్థాయి కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్‌ఐ) అక్టోబరు 9న భారత సర్వోన్నత న్యాయస్థానానికి ఫిర్యాదు చేసింది. పత్రాలను అధికారులతో పంచుకోకుండా చాలా ఏళ్లుగా కంపెనీ పబ్బం గడుపుకుంటున్నట్లు డీఆర్‌ఐ పేర్కొంది. దీనిపై రాయిటర్స్ ఈనెల 17న నివేదించింది. అన్ని ఆరోపణలను అదానీ గ్రూపు తోసిపుచ్చింది. ఏ తప్పు చేయలేదని, దర్యాప్తు అధికారులకు పూర్తిగా సహకరించినట్లు చెబుతోంది. నాలుగేళ్లకుపైగా పత్రాలు, సమగ్ర వివరాలను అందించినట్లు తెలిపింది. అదానీ బొగ్గు అక్రమాలపై వార్తలు ఇచ్చినందుకుగాను జర్నలిస్టులకు గుజరాత్ పోలీసులు సమన్లు జారీ చేయడంతో అదానీ-మోదీ/బీజేపీకి మధ్య సంబంధాలపై ప్రశ్నలు తలెత్తాయి. బడా పారిశ్రామికవేత్తగా, సంపన్నుడిగా అదానీని నిలపడంలో మోదీకిగానీ ఆయన ప్రభుత్వ విధానాలకుగానీ ఎలాంటి సంబంధం లేదని బీజేపీ చెబుతూ వచ్చింది. వ్యక్తిగత సంబంధాలు లేవంటూ ఆరోపణలను కొట్టిపారేసింది. కానీ అదానీ గ్రూపు అక్రమాలపై వెలువరించిన వార్తలకుగాను ఫైనాన్షియల్ టైమ్స్ ఇద్దరు జర్నలిస్టులు బెంజమిన్ నికోలాస్ బ్రూక్ పార్కిన్, ఛోలే నినా కోర్నిశ్‌కు గుజరాత్ పోలీసులు సమన్లు జారీ చేశారు. ఇద్దరు పాత్రికేయులపై కఠిన చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఈనెల 10న ఆదేశాలు ఇవ్వాల్సి వచ్చింది. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై దర్యాప్తుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు జర్నలిస్టులు రవి నాయర్, ఆనంద్ మాంగ్నాలేకు తాత్కాలిక రక్షణ కల్పిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇంతకుముందు ఆదేశాలిచ్చింది. అదానీ గ్రూపుపై పార్లమెంటులో ప్రశ్నించిన టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎంపీలతో వ్యవహారం కూడా అదానీ-మోదీ సంబంధాలకు అద్దంపడుతున్నాయి. ఎథిక్స్ కమిటీ ఎదుట హాజరైన మహువాతో వ్యవహరించిన తీరుతో పార్లమెంటరీ కార్యకలాపాలు, నిబంధనలు అందరి దృష్టిని ఆకర్షించాయి. లోక్‌సభ నుంచి మహువా మొయిత్రా తొలగింపునకు ఎథిక్స్ కమిటీ చేసిన సిఫార్సును ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకమైనదిగా 120 మంది ప్రముఖులు వెల్లడించారు. అదానీ సంస్థపై ఆరోపణలకు మోదీ ప్రభుత్వం స్పందించే తీరును బట్టి బడా వ్యాపారవేత్తతో ప్రభుత్వ పెద్దలకు అనుబంధం ఉందని స్పష్టమవుతోందని వారు అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే క్రోని కేపిటలిస్టుల ర్యాంకింగ్‌ల ప్రకారం టాప్ 10 దేశాల్లో భారత్ ఉన్నట్లు 'ది ఎకోనమిస్ట్' పేర్కొంది. 180 దేశాల్లో పరిస్థితిని పరిశీలించిన తర్వాత 2023, మేలో విడుదల చేసిన ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో 161వ స్థానంలో భారత్ ఉంది. 2024లో సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విపక్ష పార్టీలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నట్లు రాయిటర్స్ పేర్కొంది. అదానీ, మోదీ ఇద్దరు గుజరాతీలని, వారిపై ఆరోపణలను ఇద్దరు తోసిపుచ్చారని తెలిపింది. అయితే ఆధునిక భారత్‌లో అతిపెద్ద బొగ్గు కుంభకోణం వెనుక అదానీ సంస్థ ఉన్నట్లు కాంగ్రెస్ ఆరోపించింది. రెండేళ్లలో రూ.12వేల కోట్లకుపైగా విదేశాలకు దారిమళ్లినట్లు 'ది హిందూ' నివేదించినట్లు వెల్లడించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ 'ఇది సాధారణ లూటీ కాదు... కోట్లాది మంది భారతీయుల జేబుల్లో నుంచి ప్రత్యక్షంగా జరుగుతున్న దోపిడీ' అని వ్యాఖ్యానించారు. 2019-21 మధ్య జరిగిన 3.1 మిలియన్ టన్నుల 30 అదానీ బొగ్గు షిప్‌మెంట్ల డేటాను పరిశీలించిన తర్వాతే ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక వెలువరించిందన్నారు. బొగ్గు ట్రేడింగ్ వంటి తక్కువ మార్జిన్ ఉంటే వ్యాపారంలోనూ అదానీ సంస్థకు 52శాతం లాభం వచ్చినట్లు నివేదిక చెబుతోందని జైరాం రమేశ్ అన్నారు.

కదం తొక్కిన మహిళలు

విశాలాంధ్ర-నంద్యాల : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభల సందర్భంగా శుక్రవారం నంద్యాలలో మహిళలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ఈ ప్రదర్శనకు తరలివచ్చారు. నంద్యాల పట్టణం టెక్కే మార్కెట్ యార్డు వద్ద నుంచి బహిరంగ సభాస్థలి వేదిక ప్రముఖ పార్లమెంటేరియన్ గీతా ముఖర్జీ సభా వేదిక (టౌన్‌హాల్) వరకు ఈ ప్రదర్శన సాగింది. రాష్ట్ర 15వ మహాసభల చిహ్నంగా ప్రదర్శన అగ్ర భాగాన 15 మంది మహిళా వలంటీర్లు మహిళా సమాఖ్య పతాకాలను చేతబూని నిలిచారు. వారి వెనుక సమాఖ్య నాయకులు, ఆ వెనుక వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన మహిళలు నడిచారు. టెక్కే మార్కెట్ యార్డు నుంచి బయలుదేరిన ప్రదర్శన రాజ్ టాకీస్ సర్కిల్, శ్రీనివాస సెంటర్, ఆర్కే కలర్ ల్యాబ్ మీదుగా మున్సిపల్ టౌన్ హాల్‌కు చేరుకుంది. ప్రజానాట్యమండలి డప్పు చప్పులతో నవనందుల కోట మార్మోగింది. బాలికల కోలాటాలు పట్టణ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు అక్కినేని వనజ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జయలక్ష్మి, దుర్గాభవాని, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మహిళా సమాఖ్య నాయకులు విమల, బషీరున్నిసా, సుగుణమ్మ, పమిడిముక్కల రాణి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, కర్నూలు, నంద్యాల జిల్లాల కార్యదర్శులు గిడ్డయ్య, రంగనాయుడు, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, కర్నూలు జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నాగరాముడు, ధనుంజయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న, నాయకులు సుబ్బరాయుడు, శ్రీను, చెన్నయ్యతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సంఘటిత పోరు

(మొదటి పేజీ తరువాయి)

అమరజీవి గీతాముఖర్జీ నగర్ (టౌన్‌హాల్)లో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి. జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వనజ మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మహిళలు అంటే గౌరవం లేదన్నారు. మణిపూర్ ఘటన చాలా సిగ్గుచేటన్నారు. 76 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో అర్ధనగ్నంగా మహిళలను ఊరేగించడం విచారకరమని, ప్రధాని మోదీ ఈ ఘటనను ఖండించకపోవడం అత్యంత దారుణమన్నారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నాడు గీతా ముఖర్జీ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారన్నారు. అప్పుడు ఆ బిల్లును అడ్డుకున్న బీజేపీ ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడడంతో హడావుడిగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింపచేసిందనీ, అయితే, 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఈ రిజర్వేషన్లు అమలు చేయకుండా 2029 తరువాత అమలు చేస్తామని చెపుతోందన్నారు. ప్రపంచంలో దాదాపు 28 దేశాల్లో మహిళలు అత్యంత సమర్థవంతంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా స్త్రీలు పురుషుల కంటే సమర్థవంతంగా పనిచేస్తున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత లక్ష్యంగా పనిచేయాలని వనజ కోరారు. పాలకుల విధానాలను నిరసిస్తూ పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలనీ, ఈ మహాసభ వేదికగా చర్చించి ఆ దిశగా తీర్మానాలు చేయాలని వనజ సూచించారు.

భారతదేశ భవిష్యత్తు ఒకవైపు యువత, మరోవైపు మహిళలపై ఆధారపడి ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సతీసహగమన దురాచారాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి నాడు రాజా రామ్మోహన్ రాయ్, వీరేశలింగం లాంటి సంఘ సంస్కర్తలకు అండగా మహిళలు నిలిచారన్నారు. మహిళా రిజర్వేష పేరుతో మహిళల ఓట్లు కొల్లగొట్టడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 9 సంవత్సరాల కాలంలో రూ.115 లక్షల కోట్ల అప్పులు చేసిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై బలహీనవర్గాలపై దాడులు, అత్యాచారాలు జరుగుతుంటే అడ్డుకునేందుకు పాలకులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్య, వ్యాపార, రాజకీయ రంగాల్లో మహిళలకు సమాన హక్కులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం మహిళా సమాఖ్య పోరాడుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని చెప్పారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలని, పెరుగుతున్న ధరలు అదుపు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, అకృత్యాలు ఎక్కువయ్యాయని, వీటిపై ఈ మహాసభల్లో తీర్మానాలు చేసి వాటిని అమలు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ విమల, తదితరులు ప్రసంగించారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు, కర్నూల్, నంద్యాల జిల్లా కార్యదర్శులు గిడ్డయ్య, రంగనాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, మహిళా సమాఖ్య నాయకులు విమల, బషీరునిసా, సుగుణమ్మ, రాణి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య, కర్నూల్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నాగరాముడు, ధనుంజయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, లక్ష్మి నారాయణ, మోటా రాముడు, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న, నాయకులు సుబ్బరాయుడు, శ్రీనువాసులు, చెన్నయ్యతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బీసీలకు జగన్ తీరని ద్రోహం

- టీడీపీ రౌండ్‌టేబుల్‌లో వక్తల విమర్శ
- విలువ లేని పదవులు బీసీలకా: అచ్చెన్నాయుడు
- చట్టసభల్లో వామపక్షాలకు స్థానం అవసరం: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: వైసీపీ ప్రభుత్వం హయాంలో బీసీలపై దాడులు పెరిగాయని, అయినా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సీఎం జగన్ బీసీ జపం చేస్తున్నారని, ప్రాధాన్యత లేని పదవులు కట్టబెట్టిన జగన్‌కు బీసీలను ఓట్లు అడిగే అర్హత లేదని వక్తలు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం అధ్వర్యంలో 'బీసీల సమస్యలపై ఐక్యపోరాటం' అంశంపై స్థానిక ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర, జనసేన నాయకుడు పోతిన మహేశ్, బీసీ కులసంఘాల నాయకులు... వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలపై జరుగుతున్న దాడులపై చర్చించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బీసీల ఓట్లు తొలగించి, వారి పథకాల్లో కోత పెట్టేందుకే కులగణన పేరుతో వైసీపీ ప్రభుత్వం సర్వే చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలు బతికి బట్టకట్టాలంటే తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి బడుగు బలహీనవర్గాలపై దమనకాండ జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఏమి జరుగుతోందో దేశమంతా చూడాలని విజ్ఞప్తి చేశారు. కుంభకర్ణుడు గాఢ నిద్ర వదిలినట్లు ఎన్నికల సమయంలో జగన్ నిద్ర లేచి బీసీల జపం చేస్తున్నారన్నారు. నాలుక గీసుకోవటానికి పనికిరాని పదవులు బీసీలకిచ్చారని ఆరోపించారు.

కె.రామకృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం-జనసేన అధికారంలోకి రావాలని సీపీఐ నేతగా కోరుకుంటున్నట్లు చెప్పారు. సీపీఐ, సీపీఎం కూడా అసెంబ్లీలో ఉంటేనే ప్రశ్నించే గొంతుకలుండి అధికారపక్షం సక్రమంగా నడుస్తుందన్నారు. వైసీపీని నడిపే నలుగురు కీలక నేతలు జగన్ సామాజిక వర్గమేనన్నారు. రాష్ట్రంలో పేరుకు మాత్రమే సామాజిక న్యాయం ఉందన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని కొల్లగొట్టిన వైసీపీ నేతలు సిగ్గులేకుండా సామాజిక సాధికార యాత్ర అంటున్నారని విమర్శించారు. కీలకమైన ఒక్క పదవినైనా బీసీలు, ఎస్సీలకు జగన్ ఇచ్చారా అని రామకృష్ణ ప్రశ్నించారు.

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం బీసీల ఎదుగుదలను సహించలేకపోతోందన్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో పొందుపరిచేందుకు బీసీల సూచనలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. బడుగు బలహీన వర్గాలు ఏ గట్టున ఉంటాయో, తెలుగుదేశం పార్టీ అదే గట్టున ఉంటుందని చెప్పారు. బీసీల సమావేశానికి ఒక్క ఫంక్షన్ హాలు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం వాటి యజమానులను భయపెట్టిందని ఆరోపించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బీసీల అభ్యున్నతే ప్రధాన అజెండాగా టీడీపీ-జనసేన మేనిఫెస్టో ఉంటుందన్నారు. బీసీలను మళ్లీ మోసగించేందుకే వైసీపీ సామాజిక బస్సుయాత్ర చేపట్టిందన్నారు. బీసీల దమ్ము ఏమిటో వచ్చే ఎన్నికల్లో చూపిద్దామన్నారు. పోతిన మహేశ్ మాట్లాడుతూ సీఎం జగన్ ముమ్మాటికీ బీసీల ద్రోహి, బీసీలెవ్వరూ అతని వెంట లేరని స్పష్టం చేశారు. నా బీసీలనటానికి జగన్‌కు అర్హత లేదన్నారు. బీసీలపై టీడీపీ-జనసేనలది కన్నతల్లి ప్రేమైతే, వైసీపీది సవతితల్లి ప్రేమ అన్నారు. స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు వైసీపీ ప్రభుత్వం తీసేయటం వల్ల 16,800 పైచిలుకు బీసీలు రాజ్యాంగ పదవులు కోల్పోయారని ఆరోపించారు. 56 కార్పొరేషన్ల ద్వారా ఒక్కరికైనా సబ్సిడీ రుణం వచ్చిందా అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో ఆర్థికంగా ఎదిగిన ఒక్క బీసీ కూడా లేడని వివరించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో

అగ్రిగోల్డ్ బాధితుల అంశాన్ని చేర్చాలి

అచ్చెన్నాయుడికి సీపీఐ నేత ముప్పాళ్ల విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ కంపెనీ బాధితుల డిపాజిట్లు తిరిగి చెల్లించే విషయం తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుకి అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. దాదాపు 12 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు డిపాజిట్లు అందవలసి ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆరు మాసాలలో డిపాజిట్లు మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చి నామమాత్రంగా రూ.906 కోట్లు చెల్లించి చేతులు దులుపుకుందని ముప్పాళ్ల తెలిపారు. ఆర్థిక, మానసిక ఇక్కట్లతో అనేక మంది మృతి చెందారని, బాధితులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అచ్చెన్నాయుడు స్పందిస్తూ ఈ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టి బాధితులకు న్యాయం చేస్తామని, ఆ బాధ్యత తెలుగుదేశం, జనసేన తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు పాల్గొన్నారు.

మహేంద్ర మృతికి నైతిక బాధ్యతగా

హోం మంత్రి రాజీనామా చేయాలి

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: కరవది సుబ్బారావు

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సొంత నియోజకవర్గంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, వైసీపీలో జడ్పీటీసీ బంధువు బొంతు మహేంద్ర మృతికి నైతిక బాధ్యత వహిస్తూ హోం మంత్రి రాజీనామా చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేవలం ఫ్లెక్సీల వివాదం కారణంగా ఒక దళిత యువకుడి ఆత్మహత్యకు కారణమైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని, సొంత నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటనకు నైతికంగా బాధ్యత వహిస్తూ హోం మంత్రి రాజీనామా చేయటంతో పాటు బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువయ్యిందన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులను గృహ నిర్బంధం చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రాష్ట్ర వ్యాపిత ఉద్యమానికి శ్రీకారం చేడతామని హెచ్చరించారు.

ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షల షెడ్యూల్ జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని వివిధ డిపార్ట్‌మెంట్ టెస్టుల నవంబరు-2023 సెషన్ షెడ్యూల్‌ను ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ సెక్రటరీ జె.ప్రదీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 27 నుంచి జనవరి 3 వరకు పరీక్షలను నిర్వహిస్తారు. రోజు విడిచి రోజు ఉండేలా పరీక్షల తేదీలను ఖరారు చేశారు. వాటి పూర్తి వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయ వృద్ధి: విజయసాయి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా వృద్ధి సాధించిందని, ఏటా సగటున 12.70 శాతం వృద్ధితో అన్ని రంగాల్లో భారీ వృద్ధి నమోదు చేసిందని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా శుక్రవారం వివిధ అంశాలు వెల్లడించారు. చంద్రబాబు నాయుడు పాలనలో 2018-19 సంవత్సరంలో రూ.8,73,721.11 కోట్లుగా ఉన్న రాష్ట్ర స్థూల ఉత్పత్తి, సీఎం జగన్ పాలనలో 2022-23లో రూ.13,17,728.15 కోట్లు వృద్ధి నమోదు చేసిందన్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో జగన్ పాలనలో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.4.44 లక్షల కోట్లు వృద్ధి నమోదు చేసిందని వివరించారు. రాష్ట్రంలో భూమి సంబంధిత సమస్యలన్నిం టికీ ఒకేసారి పరిష్కారం చూపిస్తూ, సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు దేశానికే ఆదర్శమని, పేదోడికి ప్రభుత్వం అందించిన భూమిపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కొనియాడారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం పేదోడికి పట్టం కట్టింద న్నారు. రాష్ట్రంలో పేదోడికిచ్చిన 27.41 లక్షల ఎకరాల భూములపై యాజమాన్య హక్కులు కల్పించి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిందని చెప్పారు.

సామాజిక విప్లవానికి తెరదీసిన జగన్

మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సామాజిక విప్లవానికి తెరదీసిన సీఎం వైఎస్ జగన్ పాలనను సువర్ణాక్షరాలతో లిఖించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఉండగా దళితులకు అన్యాయం జరగబోదని నొక్కి చెప్పారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఏపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదల సంక్షేమం నభూతో నభవిష్యత్ అని అన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని భుజానికెత్తుకుని సీఎం జగన్ పరిపాలన చేస్తున్నారని కొనియాడారు. బడుగు, బలహీన, పేద వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం తపిస్తున్నారని స్పష్టం చేశారు. 14 ఏళ్ల పాలనలో పేదలను అణగదొక్కిన నాయకుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ఏనాడైనా దళితులకు సెంటు భూమిచ్చావా అని చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. దొమ్మేరు ఘటన సీఎం తీవ్రంగా కలచివేసిందని, ఘటన జరిగిన వెంటనే సీఎం వేగంగా స్పందించారన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం సాయం ప్రకటించిందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలుంటాయని చెప్పారు. చెల్లని కాగితంలాంటి వారు, పెయిడ్ ఆర్టిస్టులు ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. బాబు విదిల్చే డబ్బులకు అమ్ముడుపోయి మేధావుల ముసుగులో నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. ఈ దేశంలో రేషన్ కార్డుల కోసం, ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం అనేక ఉద్యమాలు చూశామన్నారు. ఏపీ చరిత్రలో ఏ ఉద్యమకారుడూ అడగకుండానే, ఉద్యమాలతో సంబంధం లేకుండా సీఎం జగన్ అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. వాటిలో అసైన్డ్ భూములకు హక్కులు కల్పించడం, గిరిజనులకు ఆర్వోఆర్ పట్టాలున్నాయని చెప్పారు.

హామీలను తక్షణం అమలు చేయాలి

- లేకుంటే డిసెంబరు8 నుంచి నిరవధిక సమ్మె
- అంగన్‌వాడీల హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే డిసెంబర్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే లలిత తెలిపారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం, అధికారులకు అనేకసార్లు విన్నవించినా స్పందన లేకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా అందోళనలు చేశామన్నారు. చివరికి రాష్ట్ర వ్యాప్తంగా అందోళనకు పిలుపునివ్వటంతో ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకోవడం జరిగిందన్నారు. అయినా తమ సమస్యలపై గళం వినిపించామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో అంగన్‌వాడీలకు తెలంగాణలో కన్నా ఎక్కువ వేతనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని... అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లయినా ఇంతవరకు అమలు కాలేదన్నారు. ముఖ్యంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మరణించిన అంగన్‌వాడీలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని, ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పనిభారం అధికంగా ఉంటోందన్నారు. సెంటర్స్‌కు అందించాల్సిన నాణ్యమైన సరుకులు అందించడం లేదని వాపోయారు. అంగన్‌వాడీ వర్కర్ల విషయంలో రాజకీయ వేధింపులు అధికంగా ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని లేదంటే డిసెంబర్ 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. దానిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పీడీ, సీడీపీఓ లకు ఈనెల 20న సమ్మె నోటీలు ఇవ్వాలని... 23వ తేదీన అన్ని జిల్లాల్లో సోదర సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి సమ్మెకు సంబంధించిన సమాచారాన్ని ప్రచారం చేయటం, 25 నుండి 30 వరకు సెక్టార్ సమావేశాల్లో సమ్మె గురించి వర్కర్స్‌కు తెలియజేయటం, డిసెంబర్ 6వ తేదీన బీఆర్ అంబేద్కర్ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సమ్మె నోటీసును సమర్పించాలని నిర్ణయించామ న్నారు. ప్రజాప్రతినిధులకు సైతం తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ, ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ప్రధాన కార్యదర్శి వీఆర్.జ్యోతి, ఎన్‌సీహెచ్ సుప్రజ, కే ప్రేమ,పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం అద్భుతం

కొమ్మినేని శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పుట్టపర్తి: సంక్షేమం, సంస్కరణలు, అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన రికార్డులు అద్భుతమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సి.ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 99 శాతం వరకు నెరవేర్చిందని, లక్షా 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, 2 లక్షల 50 వేల మంది వలంటీర్లను నియమించిందని తెలిపారు. రెండున్నర లక్షల కోట్ల రూపాయల నిధులను వివిధ పథకాల ద్వారా ఒక్క రూపాయి అవినీతి లేకుండా పంపిణీ చేసిందని అన్నారు. ప్రతి గడప వద్దకు కూడా ప్రభుత్వ పాలనను తీసుకువెళ్లారన్నారు. ముఖ్యంగా గతంలో పింఛను కోసం వృద్ధులు ఎండ, వానలో పడిగాపులు కాసేవారని, కానీ ఇప్పుడు నెల మొదటిరోజే తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్న గౌరవం అదేనని తెలిపారు. 15 వేల గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. గ్రామాలలో 50 వేల భవనాల నిర్మాణం జరుగుతోందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల అవసరాలు తీరుస్తున్నారని చెప్పారు. అలాగే, ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మీడియం బోధన, విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారని అన్నారు. ప్రతి ఒక్కరికి వైద్యాన్ని అందుబాటులో తెచ్చి గ్రామాలకు వైద్యులను పంపుతూ ఆరోగ్య సురక్ష క్యాంపులను కూడా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. పిల్లలు చదువుకోవడానికి అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టిన ఏకైక ప్రభుత్వమన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో రాష్ట్ర ప్రభుత్వం నంబర్ వన్‌గా ఉందని, పరిశ్రమల రంగం మూడవ స్థానం సాధించిందన్నారు. తీర ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టి నాలుగు ఓడరేవులు, 9 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తుందన్నారు. విశాఖ నగరంలో డేటా సెంటర్, ఐటీ కేంద్రం, ఇన్ఫోసిస్ వంటివి వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను తలపెట్టి, ఐదు వైద్య కళాశాలలను ఇప్పటికే ప్రారంభించిందని వివరించారు. మహిళల పేరు మీద ఇప్పటికే 31 లక్షల ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతో పాటు 15 లక్షల ఇళ్ల నిర్మాణం చేసిన ప్రభుత్వమన్నారు. రాష్ట్రం పూర్తి ప్రశాంతంగా ఉందన్నారు. కృష్ణానది ఒడ్డున పటిష్టమైన రిటైనింగ్ వాల్ నిర్మాణం ఏర్పాటు చేయడంతో పాటు కనకదుర్గ గుడి, బెంజ్ సర్కిల్ వంతెనల నిర్మాణం చేసిందని అన్నారు. బలహీన వర్గాలకు 50 శాతం పదవులను ఇవ్వడంతో పాటు ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చి అందులో బలహీన వర్గాలకు చెందిన నలుగురికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలా రికార్డు స్థాయిలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులందరికీ అందచేస్తోందని చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎ.రమణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ డీఐపీఆర్‌ఓ వేలాయుధం, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్డీ శ్రీనివాస్ జీవన్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత కోసం పోరాటం

టీడీపీ రౌండ్ టేబుల్‌లో వక్తల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: చట్టసభల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. బీసీలను ఓట్ల కోసమే ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం అధ్వర్యంలో బీసీ, ప్రజాసంఘాలు, అఖిలపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం నగర శివార్లలోని సాయిబాబా కళ్యాణ మంటపంలో శుక్రవారం జరిగింది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటీ నాయుడు, మాజీమంత్రి కాలువ శ్రీనివాసులు, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జగదీశ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలను పొగుడుతూ ఓట్లు దండుకొని...అధికారం చేజిక్కిన అనంతరం వారిని విస్మరించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలు ఏ రాజకీయ పార్టీలో ఉన్నా ఐక్యంగా తమ హక్కులు కాపాడుకోవాలని సూచించారు. 75 ఏళ్ల భారత స్వాతంత్ర్య చరిత్రలో ఏనాడూ బీసీలకు పూర్తిస్థాయి హక్కులు రాలేదన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదల లేనందువల్లే ఏళ్ల తరబడి బీసీలు వెనుకబాటుకు గురవుతున్నారని జగదీశ్ చెప్పారు. బీసీల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ కార్పొరేషన్‌ను రద్దు చేశారని విమర్శించారు. బీసీ మహిళ ఉషశ్రీ చరణ్ మంత్రి అయినప్పటికీ ముఖ్యమంత్రి జగన్ ఎదుట కుర్చీలో కూర్చునే పరిస్థితి లేదన్నారు. సీఎం ఎదుట చేతులు కట్టుకొని నిలబడటమేనని చెప్పారు. 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్న అహంభావంతో జగన్ సహా సకలశాఖమంత్రిగా సజ్జల రామకృష్ణా రెడ్డి, విజయసాయి రెడ్డి, పెద్దిరెడ్డి అరాచక పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.

జెండా ఏదైనా స్థానిక సంస్థలతోపాటు చట్టసభల్లో బీసీలకు సముచిత స్థానం సాధించుకోవడం కోసం ఐక్యపోరాటం తప్పదని జగదీశ్ పిలుపునిచ్చారు. బీటీ నాయుడు, కాలవ శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు శివబాల, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, కార్యవర్గసభ్యులు శ్రీరాములు, నారాయణస్వామి, టీడీపీ, జనసేన, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

డిసెంబరు 4 నుంచి 22 వరకు సూర్యలంకలో

వాయుసేన విన్యాసాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బాపట్ల జిల్లా సూర్యలంకలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ పరిధిలో డిసెంబరు 4 నుంచి 22 వరకూ సీవార్డు ఆర్టిలరీ ప్రాక్టీసు చట్టం 1949కు అనుగుణంగా ఆపరేషనల్ ట్రైనింగ్ నిర్వహణకు అనుమతిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్)ముఖ్య కార్యదర్శి ఆర్.ముత్యాలరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని సూర్యలంక పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు గమనించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఎయిర్ ఫోర్స్ ట్రైనింగ్ విన్యాసాలు డిసెంబరు 4 నుండి 22 వరకూ ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య జరుగుతాయని తెలిపారు. సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఫైరింగ్ పాయింట్ పరిధిలో 100 కిలో మీటర్ల పరిధి నుండి భూమిపై 25 కిలో మీటర్లు ఆపై ఎత్తున ఈ ఎయిర్ ఫోర్స్ విన్యాసాలు జరుగుతాయి.ప్రతి రోజు మీట్‌లో రెండు ఫైరింగులు నిర్వహించడం జరుగుతుం దని వెల్లడించారు. ఇందుకోసం సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వద్ద ఈనెల 29,30 తేదీల్లో 6 నుండి 8 ఎయిర్‌క్రాఫ్ట్ లను అందుబాటులో ఉంచేందుకు ఇండి యన్ ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు.

వైద్య బిల్లులపై జాప్యం నివారించండి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వైద్య బిల్లుల సమస్యలు పరిష్కరించి, వాటి మంజూరులో జాప్యాన్ని నివారించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు మువ్వా రామలింగం, వైద్యారోగ్య సంచాలకులు ప్రకాశ్, రాష్ట్ర ఖజానా కార్యాలయ సంచాలకులు ఎన్.మోహన్‌రావుకు శుక్రవారం హెచ్.తిమ్మన్న వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిమ్మన్న మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు అప్‌లోడ్ చేయడంలో ఉన్న సమస్య లను అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఆరు నెలల్లోపు ఉన్న బిల్లులను ఆఫ్‌లైన్ ద్వారా సీఎస్ఈకి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచించార న్నారు. ఆరునెలలు దాటి ముందుకు వెళ్లని బిల్లుల విషయమై కమిషనర్‌తో మాట్లాడాక స్పష్టత ఇస్తామని వైద్య బిల్లుల రీయింబర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.సుప్రకాశ్ తెలియజేశార న్నారు. విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు నేరుగా వైఎస్ఆర్ ట్రస్ట్ మంజూరు చేశాక, సంబంధిత అధికారులు డ్రా చేసేలా తగిన ఉత్తర్వులు ఆర్థికశాఖ అనుమతితో ఇస్తామని అధికారులు తెలిపారు. దీంతో మెడికల్ రీయిబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో దళారీలు, డబ్బు వసూలు, అవినీతి, పెరిగిపోయాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని తిమ్మన్న డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ స్టాండింగ్ కమిటీకి పంపిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే మంజూరు చేయాలని తిమ్మన్న డిమాండ్ చేశారు.

మన్యం జిల్లాలో నియోకవర్గానికి

రూ.20కోట్లు ఇవ్వాలి

సీఎం జగన్‌కు ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అత్యంత వెనుకబడిన పార్వతీపురం మన్యం జిల్లాలో నియోజకవర్గానికి రూ.20 కోట్ల చొప్పున కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జీ ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మూడు ఎస్టీ నియోజక వర్గాలు కాగా, ఒకటి ఎస్సీ నియోజకవర్గంగా ఉందని తెలిపారు. జీవనదులు పారుతున్న ఈ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే కొత్తగా ఆవిర్భవించిన పార్వతీపురం మన్యం జిల్లా అత్యంత వెనుకబడి ఉందన్నారు. సాగునీటి వసతులులేక, పంటలు పండక రైతులు ఏటా కరువు కోరల్లో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనుల కోసం ఈ జిల్లాలో వ్యవసాయ కార్మికులు, చదువుకున్న యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో తోటపల్లి కుడి, ఎడమ కాలువలు, పెద్దగడ్డ, జంపర్లకోట ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలన్నారు. జంఝావతి ప్రాజెక్టు (ఆంధ్ర-ఒడిశా ప్రభుత్వాలు చర్చించి) సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. జిల్లాలో విస్తారంగా ఉన్న గెడ్డలు, వాగులపై చెక్ డ్యాములు నిర్మించి సాగునీరు అందించాలని, అసంపూర్తిగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెనను సత్వరమే పూర్తి చేయాలన్నారు. లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి... కార్మికులకు, రైతులకు బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జీడి, పసుపు, జొన్న ప్రాసెసింగ్ చేసే కంపెనీలు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి కల్పించాలన్నారు.

వరుసగా మూడు సంవత్సరాల నుండి నష్టపోయిన జీడి రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వరి, మొక్కజొన్న, అరటి, పత్తి, పసుపు తదితర పంటలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. గిరి శిఖర గ్రామాలకు రక్షిత మంచినీరు కల్పించాలని, అధ్వానంగా ఉన్న రోడ్లను పునర్నిర్మించాలని కోరారు. ఏనుగులు తరచూ జిల్లాలో సంచరిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని... వాటికి సంబంధించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఇప్పటికే వాటి వల్ల నష్టపోయిన వారికి పంట నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఈ అంశాలపై దృష్టిపెట్టి పరిష్కరించాలని సీఎం జగన్‌ను ఈశ్వరయ్య కోరారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Tender Notice No.: 64/2023-24/SE(W-II)/EE-IV/DB/Dt:16.11.2023

Number of works : 03, Value of works : Rs. 208.54 Lakhs

Tender Opening Dt : 16.11.2023, Closing Date : 23.11.2023

Note : Further details at http://www.tender.apeprocurement.gov.in

O/o the EE - IV, Cell No.: 9912349454.

For Commissioner

సంపాదకీయం

బీజేపీ గంజాయి వనం

చత్తీస్‌గఢ్‌లో రెండవ, ఆఖరి దశ పోలింగ్‌తో పాటు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. మిజోరం ఎన్నికలు గత ఏడవ తేదీనే పూర్తయ్యాయి. అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలలో గెలుపోటములు ఎవరివి అన్న చర్చ ఫలితాలు వెల్లడయ్యే డిసెంబర్ మూడు దాకా సాగుతూనే ఉంటుంది. కానీ గతవారం రోజులుగా మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో దిమినీ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ కుమారుడు దేవేంద్రసింగ్ తోమర్ లీలలు అంతకన్నా ఆసక్తికరమైన చర్చకు దారి తీశాయి. దేవేంద్రసింగ్ తోమర్ నిర్వాకానికి సంబంధించి రెండు వీడియోలు బయటికి వచ్చిన తరవాత రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యవహారంలో మరో రెండు వీడియోలు కూడా బహిర్గతమయ్యాయి. ఇందులో దేవేంద్రసింగ్ తోమర్ చట్టవిరుద్ధ ఆర్థిక లవాదేవీలు వెలికి వచ్చాయి. మొదటి వీడియో ఆరు నిముషాల 29 సెకన్ల నిడివి ఉంది. అందులో దేవేంద్రసింగ్ తోమర్ భారీ మొత్తంలో డబ్బు లావాదేవీల గురించి మాట్లాడినట్టు స్పష్టంగా కనిపించింది. ఆయన కోట్లాది రూపాయలు వివిధ బ్యాంక్ ఖాతాలకు మళ్లించినట్టు స్పష్టమైంది. ఈ వ్యవహారం మొదట్లో వంద కోట్లదనుకుంటే చివరకు అది వెయ్యి కోట్లదని తేలింది. అంటే ఎన్నికల సమయంలో బీజేపీ నల్లధనాన్ని ఎంత విచ్చలవిడిగా వినియోగిస్తోందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రెండో వీడియో ఒక నిముషం 35 సెకన్ల నిడివి ఉంది. ఈ రెండు వీడియోల్లోనూ దేవేంద్ర సింగ్ మాట్లాడింది ఒకే వ్యక్తితో. ఆయనే జగ్‌మన్ దీప్ సింగ్. ఆయన కెనడాలో ఉంటారు. జగ్‌మన్ దీప్ నిఖార్సైన వ్యక్తి ఏమీ కాదు. కానీ ఆయనకు తోమర్ కుటుంబంతో ముఖ్యంగా దేవేంద్రసింగ్‌తో మంచి స్నేహం ఉంది. జగ్‌మన్ దీప్ కెనడాలో వందలాది ఎకరాల్లో గంజాయి తోటల సేద్యం చేస్తారు. ఆయన తాత స్వాతంత్ర్య పోరాట యోధుడు. జాతీయోద్యమ సమయంలో 23 ఏళ్లు జైలులో ఉన్నారు. ఆయన పంజాబ్ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. దేవేంద్ర సింగ్‌కు కూడా కెనడాలో గంజాయి సేద్యం ఉందంటారు. గంజాయి సేద్యం కోసమే తోమర్ కుటుంబం రాజస్తాన్‌లో దాదాపు 900 ఎకరాల భూమి సంపాదించిందన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ భూమి మొనడో అనే బినామీ కంపెనీ పేర ఉంది. తన కుమారుడు దేవేంద్రసింగ్ ఆర్థిక లావాదేవీల గురించి విడుదలైన వీడియోలు నకిలీవని, ఇది తమ కుటుంబాన్ని అపఖ్యాతి పాలు చేయడానికి ప్రతిపక్షాలు, ప్రధానంగా కాంగ్రెస్ పన్నిన కుట్ర అని నరేంద్రసింగ్ తోమర్ వాదిస్తున్నారు. కేంద్రంలో వ్యవసాయ మంత్రిగా ఉన్న నరేంద్రసింగ్ తోమర్ ప్రధానమంత్రి మోదీకి అత్యంత సన్నిహితుడు. దేవేంద్రసింగ్ తోమర్‌తో మొదటి వీడియోలో మాట్లాడినప్పుడు ప్రస్తావనకు వచ్చింది 500 కోట్ల రూపాయలు కాదని, అది పదివేల కోట్ల రూపాయలని జగ్‌మన్ దీప్ సింగ్ అంటున్నారు. మొదటి రెండు వీడియోలు విడుదల అయినప్పుడు నరేంద్రసింగ్ తోమర్ పెదవి విప్పలేదు. మూడో వీడియో విడుదలైన తరవాత ఇవి నకిలీ వీడియోలన్న వాదన ప్రారంభించారు. ఈ 'నకిలీ వీడియోల'పై దర్యాప్తు చేయించాలని నరేంద్రసింగ్ తోమర్ డిమాండ్ చేశారు. ఈ వీడియోలు అసలువో నకిలీవో తేల్చడానికి ఫొరెన్సిక్ పరీక్ష కూడా చేయించాలని కోరారు. అప్పుడే కుట్ర బయట పడ్తుందన్నారు. అవినీతిని అంతం చేస్తానని ప్రతిన పూని 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ తమ పార్టీలో చేరిన అవినీతిపరులపై ఎలాంటి దర్యాప్తు జరిపించరు. అదే తరహాలో తోమర్‌పై వచ్చిన ఆరోపణల మీదా దర్యాప్తుకు ఆదేశించలేదు. ఈ అక్రమ లావాదేవీలు బహిరంగమైన తరవాత ప్రతిపక్ష నాయకుల మీద దాడులు చేయడానికి సర్వసన్నద్ధంగా ఉండే కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ దాడులు చేయకపోగా తేలుకుట్టినట్టు మౌనంగా ఉండిపోతాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం నోరు విప్పరు. బీజేపీ నేతలెవరూ ఇంత భారీస్థాయి అక్రమ లావాదేవీల గురించి మౌనంగా ఉన్నారంటే మౌనం అర్ధంగీకారం అనుకోవాలేమో.

మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఓడినా గెలిచినా నరేంద్రసింగ్ తోమర్‌ను కేంద్ర మంత్రివర్గంలో కొనసాగించడం మోదీకి కుదరదు. మధ్యప్రదేశ్‌లో గెలిస్తే ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడే వారిలో ప్రథముడు తోమరే. ఇంత రగడ జరిగిన తరవాత ఆయనకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉండకపోవచ్చు. ఒకవేళ అందరూ ఊహిస్తున్నట్టుగా మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఓటమి పాలైతే మాత్రం తోమర్ కేంద్ర మంత్రివర్గంలో కొనసాగడం కష్టం. ఇదే అదును అని మోదీ కూడా ఆయనను వదిలించుకోనూ వచ్చు. నరేంద్రసింగ్ తోమర్ 2014–2019 మధ్య ఉక్కు, గనుల శాఖ మంత్రిగా ఉండేవారు. ఈ వీడియోలూ అప్పటి వ్యవహారానికి సంబంధించినవే అనుకుంటున్నారు. మొదటి వీడియోలో గనుల ప్రస్తావన స్పష్టంగా ఉంది. ఈ అంశంపై బీజేపీ కేంద్ర నాయకులే కాదు...మధ్యప్రదేశ్‌కు చెందిన నాయకులూ పెదవి విప్పడం లేదు. దేవేంద్ర తోమర్ దిమినీ లేదా గ్వాలియర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తారన్న వాదనలూ వినిపించాయి.

ఒక కుటుంబానికి ఒకే టికెట్ అన్న బీజేపీ సూత్రం ప్రకారం దేవేంద్ర సింగ్‌కు పోటీ చేసే అవకాశం రాలేదంటారు. 2018లోనూ ఆయన పోటీ చేయవచ్చునన్న మాట వినిపించింది. బయట పడింది కేవలం నరేంద్రసింగ్ తోమర్, ఆయన కుమారుడి అక్రమ లావాదేవీల గురించే కావచ్చు. కానీ బీజేపీ నాయకుల అవినీతి గురించి అనేక ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. వాటి మీద దర్యాప్తు జరిపించడం మాట అటుంచి కనీసం నోరు విప్పి మాట్లాడే అలవాటు కూడా మోదీకి లేదు. అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ప్రచార క్రమంలో కాంగ్రెస్ నాయకుల అవినీతి, బంధుప్రీతి, అనువంశిక రాజకీయాల గురించి దుమ్మెత్తి పోస్తుంటారు. కాంగ్రెస్ బంధుప్రీతిని, అనువంశిక పాలనను కట్టడి చేసే అవకాశం మోదీ ప్రభుత్వం చేతిలో ఉన్న వ్యవహారం కాదు. కానీ నిరాధార ఆరోపణల ఆసరాగా అనేకమంది ప్రతిపక్ష నాయకులకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించారు. అవినీతిని అంతం చేసే లక్ష్యమే ఉంటే బీజేపీ నాయకుల మీద వస్తున్న ఆరోపణల మీద దర్యాప్తునకు ఆదేశించకపోవడానికి కారణం ఏమిటి? అది కేవలం తన మిత్రులను రెక్కల కింద పెట్టుకుని కాపాడే ప్రయత్నం మాత్రమే కాదు. తన వారి మీద దర్యాప్తునకు ఆదేశించే నైతిక స్థైర్యం మోదీకి లేకపోవడమే.

విరాట్ విశ్వరూప దర్శనం

"ఇండియన్ క్రికెట్ టీం కష్టాల్లో ఉన్నప్పుడు జట్టును గెలిపించే సత్తా ఉన్న ఆటగాడు సందీప్ పాటిల్" ఈ మాటలన్నది ఆనాటి ప్రముఖ క్రికెటర్ సునీల్ మనోహర్ గవాస్కర్. ఎక్కడంటే తన సన్నీ డేస్ క్రికెట్ ఆత్మకథలో. ఇది రాసి దాదాపు మూడున్నర దశాబ్దాలు దాటింది. అయితే, ఇప్పుడు మనం చూస్తున్న ఇండియన్ క్రికెట్ టీంలో అందరూ సందీప్ పాటిల్ వంటివారే. ముఖ్యంగా గత ఐదారేళ్లుగా ఇది కళ్ల ముందు రుజువవుతున్న వాస్తవం. ఇప్పుడు జరుగుతున్న ప్రపంచ కప్‌లో అయితే అది ప్రతీ మ్యాచ్‌లోనూ కనిపిస్తోంది. ఓపెనర్ల నుంచి ఎనిమిదో ఆటగాడిగా క్రీజ్‌లోకి వచ్చిన వారు కూడా అద్భుతమైన బ్యాటింగ్ చేస్తున్నారు. ఇక బౌలర్లంటారా...పార్ట్ టైం బౌలర్లుగా వచ్చినవారు సైతం వికెట్లు తీయడం గవాస్కర్ ఆనాడెప్పుడో చేసిన వ్యాఖ్యలను కాసింత మార్చుకుని చదువుకుంటే నేడున్న టీంలో అందరూ సందీప్ పాటిల్ వంటి ఆటగాళ్లే. గవాస్కర్ చెప్పలేదు కానీ కపిల్‌దేవ్ వంటి వారు కూడా నేటి క్రికెటర్లు.

మళ్లీ గవాస్కరే. కర్నాటక, ముంబై రంజీ మ్యాచ్ చూస్తున్న గవాస్కర్‌ని ఓ కుర్రాడు ఆకట్టుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఆ కుర్రాడ్ని పిలిచి బ్యాటింగ్‌లో కొన్ని మెలకువలు చెప్పారు గవాస్కర్. ఆ

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

మ్యాచ్ తర్వాత రాసిన తన కాలమ్‌లో "ఈ కర్నాటక కుర్రాడు రాహుల్ ద్రావిడ్ భవిష్యత్‌లో ఇండియన్ క్రికెట్‌కి పెద్ద దిక్కవుతాడు" అని రాశారు. అదీ నిజమైంది. ఇక నేటి హీరో విరాట్ కొహ్లి గురించి కూడా ఇంచుమించు ఇలాంటి వ్యాఖ్యానాలే వచ్చాయి అతని అండర్ 19 వరల్డ్ కప్ మ్యాచ్‌లు చూసిన దిగ్గజాల నుంచి. క్రికెట్ చరిత్రకారుడు, సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు రామచంద్ర గుహ అయితే "కొన్నాళ్ల తర్వాత ఇండియన్ బ్యాటింగ్‌లో అప్పటి వరకూ ఉన్న రికార్డులన్నీ చెరిగిపోతాయి. ఆ రికార్డులు సృష్టించిన వారి పేర్లస్థానంలో ఈ కుర్రాడు విరాట్ కొహ్లీ పేరుంటుంది" అని రాశారు. ఈ వ్యాఖ్యానం నిజం కావడం నిన్నగాక మొన్న జరిగిన న్యూజిల్యాండ్ సెమీఫైనల్ మ్యాచ్‌లో ప్రపంచమంతా చూసింది. ఆ రోజు విరాట్‌కొహ్లీ ఆటచూసిన వారికి క్రికెట్ ఆడడం ఇంత సులువా అనిపిస్తుంది. క్రికెట్ ఆడినవారికి, ఆడుతున్న వారికి మాత్రం ఇలాఆడడం ఎంత కష్టం అనిపిస్తుంది. రెండూ నిజాలే. విరాట్ కొహ్లీ రికార్డులు సృష్టించడం కంటే కూడా ఆ బంతులు ఆడిన తీరు నన్ను చాలా ఆకట్టుకుంది. బహుశా ఓ తొమ్మిదొందలసార్లు అనుకుని ఉంటాను ఎంత బాగా ఆడాడు ఈ బాల్ అని. ఆనాటి క్రికెటర్ జీ.ఆర్.విశ్వనాథ్ ఫ్వార్వర్డ్ డిఫెన్స్ ఆడితే బ్యాట్‌కి, అతను కట్టుకున్న ప్యాడ్‌కి మధ్య సూర్య కిరణాలు కూడా వెళ్లలేవు అంటాడు గవాస్కర్ తన సన్నీ డేస్‌లో. అదే ఫార్వర్డ్ డిఫెన్స్ విరాట్ కొహ్లీ ఆడితే వర్ష ధారకి, ధారకి మధ్య కోసుకుపోతున్న ఖాళీ కూడా ఉండదనిపించింది నాకైతే. క్రికెట్ ఆడడం వేరు. క్రికెట్‌ను ప్రేమించడం వేరు. క్రికెట్టే శ్వాస కావడమంటే ఎలా ఉంటుందో విరాట్ కొహ్లీని చూస్తే తెలుస్తుంది. ఫీల్డులో ఉన్నప్పుడే కాదు.... డ్రెస్సింగ్ రూంలోనూ, సహచరులతో ప్రయాణాల్లోనూ, చివరికి తానెంతో ప్రేమించిన అనుష్క శర్మతో ఏదైనా ఇంటర్వ్యూలో ఉన్నప్పుడు కూడా క్రికెట్టే అతని ప్రాణం అన్నట్లుగా కనిపిస్తాడు. ఈ మాటలు అన్నదీ అనుష్క శర్మే. రెండు రోజులక్రితం జరిగిన ఆ ఇద్దరి ఇంటర్వ్యూలోనూ అనుష్కశర్మ మాట్లాడుతూ "సహచర బౌలర్ వికెట్ తీసిన తర్వాత మైదానంలో విరాట్ ఆనందం చూడాలే తప్ప చెప్పలేం" అందామె. ఇది న్యూజిలాండ్‌పై ఏడు వికెట్లు తీసి భారత్‌ని ఫైనల్‌కి చేర్చిన షమీ ఆనందంతో పోలిస్తే కానీ అర్థంకాదు.

బంతి అలా గాలిలో నిశ్చలంగా తేలుతున్న పక్షిలా వెళ్తూ బౌండరీలైన్ దాటి సిక్సర్‌గా మారడాన్ని చూసిన క్రికెట్ అభిమానుల ఆనందానికి హద్దు ఉండదు. అది విరాట్ అయినా, రోహిత్ అయినా, శుభ్‌మన్ అయినా, చివరాఖరి బ్యాట్స్‌మెన్ అయినా, ఏ దేశానికి చెందిన ఆటగాడైనా సరే క్రికెట్ అభిమానుల ఆనందం సేమ్ టూ సేమ్. కానీ, విరాట్ కొహ్లీ కొట్టిన కవర్ డ్రైవ్ అలా ఇద్దరు ఫీల్డర్ల మధ్యనుంచి నేలమీద తాచుపాములా, చిరుతలా పరుగులు తీయడం చూసిన తర్వాత మనకళ్లు ఎగరడం నేర్చుకోవు. విరాట్ ఆ షాట్ ఆడిన తర్వాత పచ్చని మైదానం ఆ బంతి తగిలి కవిలి పోయిందేమో అనిపిస్తుంది.

ఇండియా, న్యూజిలాండ్ సెమీ ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియంలో ప్రేక్షకులు పాడిన జాతీయ గీతం 160 డెసిబెల్స్ అని కామెంటేటర్ చెప్పారు. అంటే స్టేడియం దద్దరిల్లిందన్నమాట. అది దేశభక్తి. అదే విరాట్ కొహ్లీ సెంచరీకి మరో ఐదు పరుగుల దూరంలో ఉన్నప్పుడు స్టేడియంలో విరాట్... విరాట్ అంటూ ముంబయ్ వాంఖేడి ప్రేక్షకులు చేసిన నినాదాల శబ్దం 130 డెసిబెల్స్. ఈ విషయం కూడా కామెంటేటర్ చెప్పిందే. మరి దీన్ని ఏ అభిమానంగా కొలమానించాలి. వెస్టిండీస్ దిగ్గజ ఆటగాడు బ్రియాన్ లారాని ఇంటర్వ్యూ చేస్తూ ఓ విలేకరి అడిగిన ప్రశ్న "సచిన్ టెండూల్కర్‌పై మీ అభిప్రాయం". దీనికి లారా సమాధానం "దేవుడికి క్రికెట్ ఆడాలనిపించింది. సచిన్ టెండూల్కర్‌గా భారత్‌లో పుట్టాడు". సచిన్ తర్వాత విరాట్ కొహ్లీది దేవుడి అవతారమా..!? ఏమో...అవతారాలు చాలించిన తర్వాత మళ్లీ మరో అవతారం ఎత్తడం దేవుడికి మామూలేగా. ఇది అలాగే కావచ్చు. చాలా మంది మనుషుల్లో దేవుడున్నాడంటారు. భారత క్రికెట్‌లో సచిన్ తర్వాత విరాట్ ఆ రూపంలో ఉన్నాడేమో....

సీనియర్ జర్నలిస్టు,
ఫోన్: 9912019929

ఇజ్రాయిలీల అమానుష దాడులకు నెత్తుటితో తడిసిన గాజా

డా.కత్తి పద్మారావు

గాజా మీద జరుగుతున్న ఇజ్రాయిల్ అమానుష దాడులకు ప్రపంచం విస్తుపోయింది. యూదులను కాన్సన్‌ట్రేషన్ క్యాంపులలో పెట్టి, హిట్లర్ మారణ హోమం చేసినప్పుడు ప్రపంచ మంతా యూదులకు సానుభూతి చూపించింది. ఈనాడు అదే సానుభూతిని పలస్తీనుల మీద చూపిస్తున్నారు. నిజానికి యూదుల మేధావులలో ప్రపంచాన్ని విజ్ఞానపరంగా మార్చినవారున్నారు. ప్రపంచ మొత్తం యూదుల మేథో ప్రభావానికి అనేక సందర్భాలలో గురైంది. ఇప్పుడైతే పలస్తీనా అనుకూల ఆందోళనకారులు అమెరికా అధ్యక్షుడి అధికార నివాసం వైట్‌హౌజ్ గేట్లపై ఎరుపురంగు పెయింట్‌తో "యూదుల రాజ్యం వద్దు" అంటూ పెద్ద పెద్ద అక్షరాలను రాశారు. కాగా... బందీలను వెంటనే విడిపించాలని డిమాండ్‌చేస్తూ టెల్ అవీవ్‌లో ఇజ్రాయిల్ పౌరులు భారీ ఆందోళనను నిర్వహించారు. ఇంకోవైపు గాజాలో మానవతా సాయానికి ఇజ్రాయిల్ ఆటంకాలను కలిగించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు అంతర్జాతీయ నేర న్యాయస్థానం(ఐసీసీ) ప్రాసిక్యూటర్ కరీంఖాన్ వ్యాఖ్యానించారు. హమాస్ "క్రూరమైన దాడిని ఖండించాల్సిందే, కాని ఇంతకు ముందు కూడా ఇజ్రాయిలు చేతులు శుభ్రంగా లేవుగా!" అని ఒబామా అన్నాడు. గాజాకు అయిన గాయాలు గురించి పలస్తీనా పౌరుడు బిబీసితో మాట్లాడుతూ, "సురక్షితంగా వుండేందుకు మనం ఎక్కడికి వెళ్లాలి అని ప్రజలు అడగడంలేదు. మనం చనిపోయేటప్పటికి ఎక్కడ వుండాలి అని అడుగుతున్నారు". ఇజ్రాయిల్ అంతరాత్మ కూడా ఈ భయానక స్థితికి చలించింది. "హారెడ్జ్" ఇజ్రాయిల్‌లో పేరున్న వార్త పత్రిక. ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి జరిగిన మరుసటిరోజు తన సంపాదకీయ వ్యాసంలో... "దాడి వల్ల ఇజ్రాయిల్‌కు సంభవించిన విపత్తుకు బాధ్యత వహించవలసిన ఒకే ఒక వ్యక్తి 'బెంజమిన్ నెతన్యాహూ' అని రాసింది. పలస్తీనా ఉనికిని, హక్కులను నెతన్యాహూ విస్మరించారని ఆరోపించింది. 9వ తేదీన ఆ పత్రిక ప్రతీకార ఉద్యమాలకు, యుద్ధనేరాలకు ఆస్కారం వుండొచ్చు" అని హెచ్చరించింది. ఆ పత్రిక వ్యాసకర్తగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన గిడియన్ లేవీ 19వ తేదీన 'ఎనఫ్' (చాలు) అనే శీర్షికతో సంపాదకీయం పేజీలో రాసిన వ్యాసంలో "ఈ రక్తపాతాన్ని తక్షణం ఆపివేయాలి. వినాశానికి హద్దులు వుంటాయి." కాల్పుల విరమణకు వివిధ దేశాలు చేస్తున్న విజ్ఞప్తులను బేఖాతరుచేస్తూ గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులను కొనసాగిస్తూనే వుంది. సెంట్రల్ గాజాలోని మాఘాజీ శరణార్థి శిబిరంపై ఆదివారం తెల్లవారుజామున జరిపిన బాంబు దాడుల్లో 40 మంది మృతి చెందారు. 34 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో 8 మంది చిన్నారులు ఉన్నారు. ఇప్పటి దాకా జరిగిన ఘర్షణలో 9,700 మంది పలస్తీనీయులు మరణించారు. తాత్కాలిక కాల్పుల విరమణకు అమెరికా విదేశాంగ మంత్రి అంటోనీ బింకెన్ చేసిన విజ్ఞప్తిని ఇజ్రాయిల్ తోసిపుచ్చింది. గాజాలో ఇళ్ల నుంచి 15 లక్షల మంది వలస వెళ్లారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఇది మొత్తం ప్రజల్లో 70శాతమని పేర్కొంది. వేలమంది ఇజ్రాయిల్ ఆందోళనకారులు శనివారం జెరూసలెంలోని ప్రధాని నెతన్యాహు ఇంటి ఎదుట నిరసనకు దిగారు. ప్రధాని రాజీనామా చేయాలని, బందీలను విడిపించాలని డిమాండు చేశారు. ఇజ్రాయిల్ ప్రభుత్వ, సాంస్కృతిక శాఖమంత్రి అమిహై ఎలియహు రేడియోలో మాట్లాడుతూ... గాజాపై అణుబాంబు దాడిచేయాలని సూచించారు. అయితే దీనిని ప్రధాని నెతన్యాహు తోసిపుచ్చారు. మంత్రి వ్యాఖ్యలు వాస్తవానికి అనుగుణంగాలేవని స్పష్టం చేశారు. ఆయనను మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేశారు. తమ దేశంలోని దక్షిణ

ప్రాంతంలో రెండు కార్లపై ఇజ్రాయిల్ చేసిన వైమానిక దాడుల్లో ముగ్గురు పిల్లలు, ఒక మహిళ మరణించారని లెబనాన్ వెల్లడించింది. మరోవైపు హెజ్‌బొలా దాడిలో ఓ ఇజ్రాయెలీ మృతి చెందారు. గాజాలో వెంటనే కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేస్తూ అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని శ్వేతసౌధం ఎదుట శనివారం వేలమంది పలస్తీనా అనుకూలురు ఆందోళనకు దిగారు. ఇజ్రాయిల్‌కు అమెరికా చేస్తున్న సాయాన్ని ఆపాలని దాదాపు 10 వేలమంది పాల్గొన్నారు. జర్మనీలోని బెర్లిన్‌లోనూ ఆందోళనలు జరిగాయి. ఇజ్రాయిల్ దాడులను లండన్‌లోని యూదులు, అమెరికాలోని యూదులు ఖండించారు. ఈ విధ్వంసం అక్టోబరు 19 నాటికే ఎంత దారుణంగా వుందో ప్రముఖ విదేశాంగ మాజీ కార్యదర్శి శ్యామ్ చరణ్ ఇలా విశ్లేషించారు. మనం ఇప్పుడు 20 లక్షల మందికి పైగా పలస్తీనియన్లు నివసించే గాజా స్ట్రిప్‌లో ఒక పెద్ద మానవ విషాదం అంచున ఉన్నాము. గాజా ఉత్తర భాగంలో నివసించే ప్రజలను, ఆ ప్రాంతాన్ని ఖాళీచేసి స్ట్రిప్ దక్షిణభాగం వైపు వెళ్లాలని ఇజ్రాయిల్ రక్షణ దళాలు హెచ్చరించాయి. ఈజిప్టుకు వెళ్లే ఏకైక నిష్క్రమణ స్థానం రఫాహ్ చెక్‌పాయింట్ ద్వారా వెళుతుంది. దాన్ని కూడా మూసివేశారు. ఈజిప్ట్ కోరుకునే చివరి విషయం వేలాది పలస్తీయన్ల వలసే. ఇజ్రాయిల్ దిగ్బంధనం వల్ల అత్యవసరంగా కావలసిన ఆహారం, నీరు, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఇవన్నీ ఇజ్రాయిల్ ద్వారానే వస్తాయి. ఇప్పటికే పనిచేస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లలో వైద్య సామాగ్రి అయిపోయింది. అమెరికా జోక్యం వీటి సరఫరా పునఃప్రారంభానికి దారితీసింది. కానీ ఇది దక్షిణ గాజాకు మాత్రమే. గాజాలో పలస్తీనియన్ల సామూహిక శిక్ష, హమాస్ నాయకత్వాన్ని నిర్వీర్యంచేసే అవకాశంలేదు. లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాకు మల్లే ఇరాన్ హమాస్‌కు మద్దతు ఇస్తోంది. ప్రపంచస్థాయి నిఘా, సైనిక సామర్థ్యాలు ఉన్నప్పటికీ దాడిని నిరోధించలేకపోయిన బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వంపై ఇజ్రాయిలీలకు ఆగ్రహంఉంది. 1967 నుండి 2005 వరకు దక్షిణ గాజాలోని తన ఆవాసాలను ఖాళీచేసి పలస్తీనియన్ నేషనల్ అథారిటీ (పీఎన్‌ఏ)కి పగ్గాలు అప్పగించినట్లుగానే, ఇప్పుడు సైతం గాజాను ఆక్రమించడానికి ఇజ్రాయిల్ విముఖత చూపవచ్చు. కానీ 2007లో హమాస్ గాజా బాధ్యతలు స్వీకరించింది. అప్పటి నుండి పీఎన్‌ఏకి ఎటువంటి పాత్రా లేదు. గాజా దాని మధ్యధరాతీరంపై ఇజ్రాయిల్ గగనతలం నియంత్రణను కొనసాగించింది. ఇజ్రాయిల్, అరబ్ దేశాల మధ్య సంబంధాలను సాధారణీకరించే ధోరణి ఇప్పుడు సవాలును ఎదుర్కొంటోంది. ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాల స్థాపన, రాయబార కార్యాలయాల మార్పిడికి దారి తీస్తుందని భావిస్తున్న కీలకమైన చర్చలను నిలిపివేస్తున్నట్లు సౌదీ అరేబియా ఇప్పటికే ప్రకటించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో ఇజ్రాయిల్, దాని నౌకాశ్రయం హైఫాను కలుపుకొని ప్రకటించిన 'ఇండియా మిడిల్ ఈస్ట్ యూరోప్ ఎకనామిక్ కారిడార్' ఇప్పుడు సందిగ్ధంలోపడే అవకాశంఉంది. అమెరికా, యూరప్‌లోని గణనీయమైన అరబ్ డయాస్పోరాలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం, ముస్లిమేతర ప్రజలలో కూడా ఆగ్రహావేశాలతో కూడిన ప్రదర్శనలు జరిగాయి.

పలస్తీనా సమస్యను అరబ్ రాజ్యాలతో సహా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వాలు కూడా పక్కన పెట్టేశాయి. ఇప్పుడు ఇదే ప్రాంతీయ ప్రపంచ రాజకీయాలకు కేంద్రం అవుతుంది. సరిగ్గా హమాస్ సాధించాలనుకున్నది ఇదే. శాంతి, శ్రేయస్సుతో కూడిన యుగానికి దారితీస్తూ, ఇజ్రాయిల్‌ను పశ్చిమాసియా రాజకీయ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలనుకోడం అమెరికా మద్దతు కలిగిన ప్రాంతీయ ఒడంబడిక వైపు మొగ్గుచూపడం అనేది ఇప్పుడు సమాధి అయిపోయింది. ఇంకా చెప్పాలంటే పలస్తీనా సమస్య ప్రస్తుతం స్తంభించిపోయింది. ఇరాన్, లెబనాన్ కూడా ఘర్షణ కేంద్రాలుగా మారితే వివాదం మరింత తీవ్రమయ్యే ప్రమాదంఉంది. విస్తృతస్థాయి యుద్ధంగా మారితే మహా విపత్తు అవుతుంది. పౌరుల లక్ష్యాలపై హమాస్ ప్రారంభించిన భయంకరమైన ఉగ్రవాదుల దాడి అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయిల్‌కు సంఘీభావం తెలిపారు. గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆసుపత్రిపై ఇజ్రాయిల్ దాడులు చేసిందన్న పలస్తీనా ఆరోపణలను ఇజ్రాయెల్ సైన్యం ఖండించింది. పలస్తీనా ఇస్లామిక్ జిహాద్ మిలిటరీ గ్రూప్ రాకెట్ మిస్‌ఫైర్ అయి ఆసుపత్రిపై పడిందని తెలిపింది. పలస్తీనా ఇస్లామిక్ జిహాద్ మిలిటరీ గ్రూప్ హమాస్‌తో కలిసి మిత్ర కూటమిగా పనిచేస్తోంది. హమాస్, ఇజ్రాయిల్ యుద్ధం మంగళవారం భీకర రూపం సంతరించుకుంది. సెంట్రల్ గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆసుపత్రిపై ఇజ్రాయిల్ జరిపిన భారీ వైమానిక దాడిలో ఏకంగా 500 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్టోబరు 7న హమాస్ దళాలు ఇజ్రాయిల్‌లో నోవా ఫెస్టివల్‌పై దాడులు ప్రారంభించాయి. ఇరుపక్షాలవైపు దాడుల్లో ఇజ్రాయిల్‌లో సైనికులు, మహిళలు, చిన్నారులతో సహా 1,400 మందికిపైగా జనం మరణించారు. హమాస్ దళాల చేతికి దాదాపు 200మంది ఇజ్రాయిల్ పౌరులు బందీలుగా చిక్కారు. ఈ విషయాన్ని యావత్ ప్రపంచం తెలుసుకోవాలి. ఆసుపత్రి సమీపంలో పిఐజె మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్ గురితప్పి ఆసుపత్రిలో పేలుడు సంభవించిందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ పేర్కొంది. ఈ దాడి నేపథ్యంలో బైడెన్ జోర్డాన్ పర్యటన రద్దయింది. జోర్డాన్‌లో ఆయన అబ్దుల్లాతో పాటు ఈజిప్టు ప్రధాని ఎల్-సిసి, పలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్ తదితరులతో భేటీ కావాల్సి ఉండగా, ఆ సమావేశం రద్దయినట్లు జోర్డాన్ విదేశాంగ మంత్రి తెలిపారు. బైడెన్ ఇప్పటికే ఇజ్రాయిల్ పర్యటన నిమిత్తం బయల్దేరారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కూడా ఈ వారం ఇజ్రాయిల్‌లో పర్యటించనున్నారు. గాజా మీద జరుగుతున్న దాడులు ఇంకా కొనసాగడం ప్రపంచ శాంతికి భంగకరం. క్రైస్తవం పేరుతో ఇస్లాం పేరుతో ప్రపంచానికి అణు యుద్ధ ప్రమాదం పొంచి వుంది. అణ్వాయుధాల సృష్టికర్తలు కూడా యూదులే. యూదుల ఇస్లాం ఉగ్రవాదుల మతోన్మాద భావనను అమెరికా సామ్రాజ్యవాదం ఉపయుక్తం చేసుకుంటుంది. ప్రపంచంలోని మానవ హక్కుల పోరాట వాదులందరూ కలసి ఈ మతోన్మాద భావనలకు వ్యతిరేకంగా పోరాటంచేసి మానవతా శాంతి చరిత్రలో భాగస్వాములవుదాం.

ఫోన్ : 9849741695.

ఎన్నికల ఎజెండాగా పట్టణ ఉపాధి హామీ

డాక్టర్. సీ.ఎస్.క్షేత్రపాల్ రెడ్డి

కరోనా సృష్టించిన కల్లోలంలోంచి తేరుకునే లోపే వాతావరణం, వ్యవసాయం రంగంలో వస్తున్న మార్పులు గ్రామాల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. ఉపాధి అవకాశాలు లేక గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయి. సొంతూరిని, తమ అనుకున్న వారిని వదిలి పట్టణాల్లో బతుకుదామని పొట్టచేతబట్టుకుని వలసబాట పట్టిన అన్నదాతలు, వలస కూలీల ఆక్రందనలు అన్నీ ఇన్నీ కావు. బతుకు తెరువును వెతుక్కుంటూ కదిలిన గ్రామీణ భారతం కారణంగా పట్టణాలు, నగరాలు కిక్కిరిసి పోతున్నాయి. పట్టణాలు, నగరాల్లోని ఏ కూడలిని చూసినా వలస కార్మికులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఉదయాన్నే సద్ది మూటల్తో ఎక్కడ పని దొరుకుతుందో...ఎవరు ఈ పూట, ఏ పనికి పిలుస్తారో అనే ఆశతో ఎదురుచూసే వలస కార్మికుల సంఖ్య లక్షల్లోనే ఉంది. వీరికి వారికి వారంలో కనీసం రెండు రోజులు పని కూడా దొరకని పరిస్థితి. ఉదయం అంతా పని కోసం వెంపర్లాడి, రాత్రికి పట్టణాల్లో ఎక్కడ సందు దొరికితే అక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న కుటుంబాలతో కొన్ని ప్రాంతాలు మురికివాడల లిస్టులోకి చేరుతున్నాయి. దేశంలో సుమారు నాలుగువేలకు పైగా నగరాలు, పట్టణాలు వున్నాయి. ఇప్పటికే పట్టణ జనాభా 40 శాతం పెరిగింది. కరోనా నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్ తరుణంలో ఉపాధి మృగ్యమై, ఆకలికి తాళలేక సొంతూళ్లకు కాలినడకన కదిలిన వలస కూలీల సంఖ్యయే ఇందుకు నిదర్శనం. వలస కార్మికులకు పట్టణాల్లో తిండి కూడా దొరకని పరిస్థితి ఏర్పడడం, అయిన వారి మధ్య కలో...గంజో తీసుకుని జీవించవచ్చనే ఆశ, గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టమైనా ఉందనే ధీమాతో కోట్లమంది వలస కార్మికులు తమ సొంతూళ్లకు వెళ్లారు.

2014లో మోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గ్రామీణ ఉపాధి హామీ పథకం గొంతు నులిమే పని మొదలైంది. నయా ఉదారవాద సిద్ధాంతం ఆలంబనగా గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సహా అనేక సంక్షేమ పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో కత్తిరింపులు మొదలయ్యాయి. గ్రామీణ ఉపాధికోసం 2021–22లో ఖర్చు రూ.98,467.85 కోట్ల ప్రతిపాదన కాస్త 2022–23 బడ్జెట్‌లో రూ.73 వేల కోట్లుకు కుదించారు. ఇది 33శాతం కోతతో 2023–24 నాటికి రూ.60 వేల కోట్లుకు పడిపోయింది. ఇలా కేటాయించిన అరకొర నిధుల విడుదలకు సవాలక్ష కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తూ పథకం ప్రయోజనాలు కార్మికులకు అందకుండా కేంద్రమే మోకాలడ్డుతోంది. వందరోజుల పని గ్యారెంటీతో చట్టబద్ధమైన పథకంలో ఈ ఏడాది సగటున పనికల్పించి దినాలు కేవలం 47 రోజులు మాత్రమేనని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కోట్ల మంది పనికోసం దరఖాస్తులు పెట్టుకుని కళ్లుకాయలు కాసేలా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడడం, వర్షాభావ పరిస్థితుల కారణంగా పనులులేక, తమకు సొంత గ్రామాల్లో ఉపాధి కరువైన వాస్తవాన్ని గ్రహించిన కోట్ల మంది గ్రామీణులు ఉపాధి మార్గాల అన్వేషణలకు పట్టణాలే దిక్కని భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే గ్రామీణ ప్రాంతంలో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకం అవసరం ముందుకు వచ్చింది. కరోనా మహమ్మారి సమయంలో ఉద్యోగాలు కోల్పోయిన కోట్లాది మంది పట్టణ కార్మికులకు ఆదాయ భద్రత కల్పించే మరో మార్గంగానూ కనిపిస్తోంది. ఈ మేరకు అనేక నివేదికలు, సర్వేలు ప్రభుత్వానికి సూచనలు కూడా చేశాయి. అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం 2019లో విడుదల చేసిన నివేదికలో ఒక కీలకమైన ప్రతిపాదన చేసింది. దేశంలోని పట్టణ ప్రాంతంలోని వలస కార్మికుల్లో నైపుణ్యాలు ఉన్నవారికి లేబర్ మార్కెట్‌లో పోటీపడేందుకు అవసరమైన శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చునని పేర్కొంది. ఇది అక్షరాస్యతను పెంపొందించడంలోనూ మంచి ఫలితాలనిస్తుందని తెలిపింది. ఉత్పాదకత మెరుగుపడి ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి దోహదం చేస్తుందని వెల్లడించింది. అయితే పట్టణ ప్రాంతాలకు హామీని విస్తరించే ముందుగా ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా ఒక్కో నగరానికి 1000 కోట్లు చొప్పున ఒక ఏడాదిపాటు ఒకటి రెండు నగరాల్లో పట్టణ ఉపాధిహామీ పనులను ప్రారంభించి విశ్లేషించడం ద్వారా మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చని తెలిపింది. వివిధ రాష్ట్రాలు ఇప్పటికే పట్టణ ఉపాధికోసం ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించాయి. ఒడిశాలో అక్కడి ప్రభుత్వం అర్బన్ వేజ్

ఎంప్లాయ్‌మెంట్ ఇనిషియేటివ్ పేరుతో పట్టణాల్లో ఉపాధి మార్గాలను చూపించేందుకు కృషి ప్రారంభించింది. హిమాచల్ ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి పట్టణ జీవనోపాధి హామీ కార్యక్రమాన్ని చేపట్టింది. తాజాగా జార్ఖండ్‌లోనూ ముఖ్యమంత్రి శ్రామిక్ యోజన పేరుతో చర్యలు చేపట్టింది. తమిళనాడులో తమిళనాడు అర్బన్ ఎంప్లాయ్‌మెంట్ పథకాలు అమలవుతున్నాయి. అన్నిటికన్నా కేరళలోని వామపక్ష ప్రభుత్వం దేశానికే ఆదర్శప్రాయమైన పనిప్రారంభించింది. ఉన్నతమైన ఆశయాలతో 'అయ్యంకాళి పట్టణ ఉపాధి హామీ పథకం' పేరుతో చేపట్టిన పథకం గత కొన్ని సంవత్సరాలుగా మంచి ఫలితాలను ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో డైరెక్టరేట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ అమలవుతున్న ఈ పథకం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. వివిధ కారణాలతో కార్మికులకు అవసరమైన పనిలేనప్పుడు ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడమే దీని ప్రధాన లక్ష్యం. పట్టణాల్లోని పేదలను ఆదుకోవడం లక్ష్యంగా దీన్ని రూపొందించారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ఉపాధి కోసం అభ్యర్థించే లబ్ధిదారుల పేర్లను స్థానిక యంత్రాంగం నమోదు చేసుకుంటుంది. అలా నమోదైన వారికి 15 రోజుల్లో జాబ్ కార్డులు ఇవ్వడం, మరో 15 రోజుల్లో పని కల్పించడం అనేది కేరళ ప్రభుత్వం తన బాధ్యతగా స్వీకరిస్తోంది. ఆ పథకం విజయవంతంగా నడుస్తోంది అనడానికి లబ్ధిదారుల్లో 50శాతం మంది మహిళలు ఉండడమే నిదర్శనం.గ్రామాలతో పోలిస్తే పట్టణాలలో పనుల పరిధి చాలా వైవిధ్యంగా ఉంటుంది. స్వచ్ఛమైన నీటి సరఫరా, డ్రైనేజీ, పారిశుధ్యం, మురికివాడల్లో ప్రాథమిక సేవలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, వంతెనల నిర్మాణం, సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో సేవలు, పిల్లలు, వృద్ధులు, వికలాంగుల సేవలు తదితర రంగాల్లో ఉపాధి కల్పనకు అవకాశాలు అపారంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో పట్టణ పేదలకు, వలస కార్మికులకు ఉపాధి కల్పన అనేది కేంద్రం తన బాధ్యతగా గుర్తించాలి. గ్రామీణ ఉపాధి హామీతోపాటు పట్టణ ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలి. ఇప్పటికే కిక్కిరిసిపోయి ఉన్న పట్టణాల్లో పనులు దొరక్క లక్షల మంది నిరుద్యోగ సైన్యం ఇబ్బందులు పడుతున్న తరుణంలో అదనంగా కోట్లమంది పట్టణాల్లో అడుగు పెట్టడం పట్టణాలకు అదనపు భారంగా మారుతున్న క్రమంలో భారతదేశం పట్టణ ఉపాధి హామీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఇదే సరైన సమయం. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఇందుకు ఎటువంటి చర్యలు తీసుకోదని వారి విధానాలను గమనిస్తేనే తెలుస్తుంది. ఉపాధి భద్రత మనిషిలో ఆత్మాభిమానాన్ని పెంపొందిస్తుంది. రానున్నది ఎన్నికల కాలం. మోదీ ప్రభుత్వంలో జవసత్వాలు కోల్పోతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించే చర్యలు తీసుకోవడంతో పాటు పట్టణ ఉపాధి హామీ పథకం పేరుతో నూతన చట్టం తీసుకురావడం అనేది బీజేపీ యేతర రాజకీయ పార్టీలకు పొలిటికల్ ఎజెండాగా మారాలని ఆశిద్దాం.

సెల్: 9059837847

ఖమ్మంలో 'కారు' సీన్ రివర్స్

అధికార బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికార బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పార్టీపై అలకబూనిన అనేక మంది నేతలు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేస్తున్నారు. హ్యాట్రిక్ కొట్టి తీరాల్సిందేనని విశ్వప్రయత్నాలు చేస్తున్న గులాబీ దళపతి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఊహించని షాకులు తగులుతుండటంతో కంటిమీద కునుకులేకుండయ్యింది. బీఆర్ఎస్‌లోని అసంతృప్తులు, టికెట్లు దక్కని సిట్టింగ్ సభ్యులు కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. దీంతో హస్తం పార్టీ హౌస్‌ఫుల్ అయ్యింది. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో పాగా వేయాలనే ప్రణాళికలతో బీఆర్ఎస్ ముందుకువెళుతోంది. ఇటీవల ఒక మాజీ మంత్రి, అనేక మంది సీనియర్ నేతలు, యువనేతను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు కేసీఆర్. వీరంతా ఎమ్మెల్యే అభ్యర్థులకు, కీలక నేత అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రధాన అనుచరులే. దీంతో సరైన సమయం కోసం వేచి చూసిన కాంగ్రెస్... బీఆర్ఎస్‌ను గట్టిగానే దెబ్బకొట్టింది. అధికార పార్టీలో అసంతృప్తిగా ఉన్న నేతలపై ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేతలు దృష్టిపెట్టారు. ఖమ్మంలో బీఆర్ఎస్‌కు బలం తక్కువేనన్నది సొంత పార్టీ నేతలు చెబుతున్న మాట. కీలక నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్న తరువాత పరిస్థితులన్నీ రివర్స్ అయ్యాయి. కాస్తో కూస్తో కారు పార్టీ కోలుకుంటోందనుకున్న సమయంలో కాంగ్రెస్ ఊహించని దెబ్బ కొట్టింది. ఖమ్మం డిప్యూటీ మేయర్ ఫాతిమా బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఆమె భర్త ముక్తార్ సుడా డైరెక్టర్‌గా, నగర మైనారిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ ఇద్దరూ రాజీనామా చేసి సీనియర్ నేత తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్-బీజేపీ-ఎంఐఎం ఈ మూడు పార్టీలు ఒక్కటేనన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను మైనార్టీలు బలంగా నమ్ముతున్నారని ఫాతిమా దంపతులు చెప్పుకొచ్చారు. ఇటీవలే మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, పీసీసీ అధ్యక్షుడికి అత్యంత సన్నిహితుడు, విద్యార్థి నేతగా పేరున్న కూటూరి మానవతారాయ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి కృష్ణ, సీనియర్ రాజకీయ నేత పూకె అబ్బయ్య దంపతులు, డా. రామచంద్రు నాయక్... వీరితో పాటు అనేక మంది సీనియర్



నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో కౌంటర్ ప్లాన్ చేసిన కాంగ్రెస్ డిప్యూటీ మేయర్‌ను పార్టీలో చేర్చుకుంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శారద, ఆమె భర్త గుడిపూడి రామారావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో వీరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే తుమ్మల సమక్షంలో అనేక గ్రామాల నేతలు, కార్యకర్తలు హస్తం పార్టీ కండువా కప్పుకున్నారు. అధికార పార్టీ నేతలు ప్రజా ప్రతినిధులైన తమపై అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారని కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఖమ్మంలో అరాచక అవినీతి పాలనను తరిమికొట్టాలని, ఇవి అహంకారానికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్న ఎన్నికలని, బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన నేతలు అంటున్నారు. అక్రమ కేసులు, కబ్జాలు, భూ దందాలతో అరాచక ఖమ్మంగా మారిందని మండిపడుతున్నారు. తెలంగాణ ఎన్నికలు దేశ ఎన్నికలకు ఓ మలుపని, అరాచకం లేని, ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పార్టీ ఫిరాయించిన నేతలు చెబుతున్నారు. మొత్తం మీద బీఆర్ఎస్‌కు చెందిన అనేక మంది కీలక నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో ఇక్కడ బీఆర్ఎస్‌కు గడ్డు పరిస్థితులు తప్పేలా లేవని చెప్పాలి.

- బి.రామారావు, హైదరాబాద్

పసలేని ఎన్నికల ప్రణాళిక

బీజేపీ మేనిఫెస్టోపై అశోక్ గెహ్లాత్

జైపూర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో పస లేదని, ఈ మేనిఫెస్టో ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ శుక్రవారం విమర్శించారు. నవంబరు 25న జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సంకల్ప పాత్ర పేరుతో ఎన్నికల ప్రణాళికను గురువారం విడుదల చేశారు. ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.450కే సిలిండర్, ఐదేళ్లలో 2.5 లక్షల ఉద్యోగాలు వంటి హామీలను నడ్డా ప్రకటించారు. దీనిపై ఇక్కడి విమానాశ్రయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గెహ్లాత్ స్పందిస్తూ ఆ మేనిఫెస్టోలో కొత్తదనమేమీ లేదని చెప్పారు. మేనిఫెస్టో కోసం బీజేపీ నేతలు కనీసం కసరత్తు చేసినట్లు కనిపించడం లేదని అన్నారు. రాష్ట్రంలో తాము ఇప్పటికే చాలా పథకాలు అమలు చేస్తున్నామని, తమ మేనిఫెస్టోలో కొన్ని హామీలు ఇచ్చామని గెహ్లాత్ గుర్తు చేశారు. తమ హామీలనే బీజేపీ కాపీ కొట్టిందని ఆరోపించారు. బీజేపీ మేనిఫెస్టోపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అందులో గొప్పగా చెప్పుకోదగిన హామీలేవీ లేవని ముఖ్యమంత్రి తెలిపారు. రూ.450కే సిలిండర్ ఇస్తామన్న హామీపై స్పందిస్తూ తమ ఒత్తిడి కారణంగా కేంద్ర ప్రభుత్వమే సిలిండర్ ధరలు కొంత మేరకు తగ్గించిందని, ఇప్పుడు రూ.450 గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. ఉజ్వల లబ్ధిదారులకు మాత్రమే రూ.450కి సిలిండర్ ఇవ్వడం బీజేపీ లక్ష్యమని విమర్శించారు. తాము మాత్రం అందరికీ రూ.500కే సిలిండర్ హామీ ఇచ్చామన్నారు. దీనివల్ల 1.05 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

కాంగ్రెస్‌దే అధికారం: పైలట్

రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ దీమా వ్యక్తం చేశారు. టాంక్ నియోజకవర్గంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'నాకు పూర్తి నమ్మకం ఉంది. ప్రజలపై విశ్వాసం ఉంది. రాజస్థాన్‌లో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని చెప్పారు. బీజేపీ ప్రచారమే సరిగా లేదని, దీనిపై బీజేపీ అగ్రనాయకులే ఆందోళన చెందుతున్నారని పైలట్ తెలిపారు. దిల్లీ నుంచి నాయకులు వస్తున్నారు. మంత్రులంతా...ప్రధాని మంత్రి వస్తున్నారు. అయినా ప్రజల నుంచి వారికి సరైన స్పందన రావడం లేదని వివరించారు. బీజేపీ నాయకులు విభజన వ్యూహాలు అమలు చేస్తున్నారని, అయినా ప్రజలు తెలివైన వారని, బీజేపీ ఉచ్చులో పడటానికి సిద్ధంగా లేరని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు ఎంత కష్టపడినా ప్రయోజనం లేదని, ఇక్కడ కాంగ్రెస్‌దే పైచేయని వ్యాఖ్యానించారు.

అభివృద్ధికి ఓటేశా: మహాజన్

ఇండోర్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం అభివృద్ధికి ఓటేశానని ఆమె చెప్పారు. ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత పీటీఐ అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. అభివృద్ధికి ఓటేశానని ఆమె పీటీఐతో మాట్లాడుతూ తెలిపారు. ప్రజల్లో ఓటు పట్ల అవగాహన పెరిగిందని పేర్కొన్నారు. ఓటు అనేది రాజ్యాంగ హక్కు అని, వినియోగించుకోవడం మన విధి అని 80 ఏళ్ల మహాజన్ చెప్పారు. మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగింది.

డబ్బు, మద్యమే బీజేపీ ఆయుధం

కమల్‌నాథ్ విమర్శ

భోపాల్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పాలక బీజేపీ ఓటర్లకు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేసిందని కాంగ్రెస్ మధ్యప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్ శుక్రవారం విమర్శించారు. పీసీసీ కార్యాలయం వద్ద కమల్‌నాథ్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ వెంట పోలీసులు, డబ్బు, పాలనా యంత్రాంగం మాత్రమే ఉందని, గురువారమంతా విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ చేసిందని విమర్శించారు. బీజేపీ డబ్బు పంపిణీ చేస్తున్న వీడియోలు అనేకం తన వద్ద ఉన్నాయని చెప్పారు. ఇండోర్-1 అసెంబ్లీ నియోజకవర్గం ప్రాంతంలోని పోలీసు స్టేషన్‌లో బీజేపీ గందరగోళం సృష్టించిందని, పరిస్థితి గురించి అక్కడి అధికారులతో తాను మాట్లాడనని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీయే గూండాగిరి చేసినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ ఆరోపించిన విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా అంతకన్నా వాళ్లేమి చెబుతారని కమల్‌నాథ్ ఎదురు ప్రశ్నించారు. కాంగ్రెస్ దాదాగిరి చేసినట్లు ఒక్క ఉదాహరణ అయినా చెబుతారా అని అడిగారు.

బీజేపీ మినహా ఏ పార్టీ విజయం సాధించినా పాకిస్తాన్‌లో సంబరాలు జరుగుతాయని మంత్రి మిశ్రా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ పాకిస్తాన్ గురించి మాట్లాడటానికి ముందుగా మంత్రి మిశ్రా గెలుస్తారో లేదో చూసుకుంటే మంచిదని హితవు పలికారు. బీజేపీకి తిరిగి అధికారం కట్టబెడితే సుసంపన్న మధ్యప్రదేశ్‌ను నిర్మిస్తామని ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చౌహాన్ పేరు ప్రకటించకుండా బీజేపీ ఆయనను దూరం పెట్టిందని ఆరోపించారు. విజయం తర్వాతే ముఖ్యమంత్రిపై నిర్ణయం తీసుకుంటామని బీజేపీ చెబుతోందని, దీంతో ఏమి మాట్లాడుతున్నారో చౌహాన్‌కు అర్థం కావడం లేదని, చౌహాన్ ఓ నటుడని, ఆయన నటిస్తూనే ఉంటారని కమల్‌నాథ్ ఆరోపించారు.

మంత్రి మిశ్రాపై చర్య తీసుకోవాలి: దిగ్విజయ్

భోపాల్: రాష్ట్రంలో బీజేపీ మినహా ఏ పార్టీ విజయం సాధించినా పాకిస్తాన్‌లో ఉత్సవాలు జరుగుతాయని ప్రకటించిన మధ్యప్రదేశ్ హోంమంత్రి నరోత్తం మిశ్రాపై కఠినచర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఓవైపు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న సమయంలోనే మంత్రి మిశ్రా ఈ వ్యాఖ్యలు చేశారు. దేశానికి సేవ చేయాలని కోరుకునే వారంతా బీజేపీకి ఓటేయాలని ఆయన కోరారు. 'ఇది రెచ్చగొట్టే ప్రకటన. మంత్రి మిశ్రాపై కఠినచర్య తీసుకోవాల్సిందే. భారత ఎన్నికల కమిషన్ వెంటనే మంత్రికి నోటీసు ఇవ్వాలి' అని దిగ్విజయ్ డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రకటనలు చేయడం మిశ్రాకు అలవాటుగా మారిందని మాజీ సీఎం దిగ్విజయ్ ఆరోపించారు. మిశ్రాపై ఎన్నికలకు సంబంధించిన మరో కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని ఆయన గుర్తుచేశారు. ఇలాంటి ప్రవర్తన గల మిశ్రాకు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదని స్పష్టంచేశారు.

బీజేపీ దాడిలో కాంగ్రెస్ నేత మృతి

ఎంపీలో హింసాత్మక ఘటనలు

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి పోలింగ్ జరుగుతున్న వేళ...కొన్నిచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని రాజ్‌నగర్ నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కాంగ్రెస్ అభ్యర్థి అనుచరుడు మృతిచెందాడు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో స్వల్ప ఘర్షణలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఇండోర్ జిల్లా మో ప్రాంతంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురు, మొరేనా జిల్లా దిమానీ నియోజకవర్గంలో ఇద్దరు గాయపడ్డారు. దిమానీ నియోజకవర్గంలో కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ బీజేపీ తరపున పోటీ చేశారు. రాజ్‌నగర్ నియోజకవర్గంలో ఇద్దరు రాజకీయ నాయకుల అనుచరుల మధ్య శుక్రవారం ఉదయం జరిగిన ఘర్షణలో సల్మాన్ అనే వ్యక్తి మృతిచెందినట్లు చతర్‌పూర్ ఎస్‌పీ అమిత్ సంఘీ చెప్పారు. రాజ్‌నగర్‌లో కాంగ్రెస్ తరపున విక్రమ్‌సింగ్ అలియాస్ నటిరాజా పోటీ చేశారు. బీజేపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగానే గొడవ సృష్టించి..సల్మాన్‌ను చంపారని విక్రమ్‌సింగ్ ఆరోపించారు.

అయితే, ఇది కుట్రపూరితమని, దీనిపై న్యాయ విచారణ చేయాలని బీజేపీ అభ్యర్థి అరవింద్ పటేరియా ఎదురుదాడికి దిగారు. అత్యంత సున్నితమైన మొరేనా జిల్లా సుమవాలీ నియోజకవర్గంలో పోలింగ్ శాంతియుతంగా జరిగేందుకు సహకరించాలని, ఎక్కడైనా ఒకచోటు కూర్చోవాలని బీజేపీ అభ్యర్థి అందల్‌సింగ్ కన్సానా, కాంగ్రెస్ అభ్యర్థి అజబ్ సింగ్ కుశ్వాహా, బీఎస్‌పీ అభ్యర్థి కుల్దీప్ సింగ్ సికర్వార్‌లకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఆ ముగ్గురు అభ్యర్థులను నిన్న పిలిచి మాట్లాడామని, పోలీసులు చెప్పినట్లు వింటామని హామీ ఇచ్చారని మొరేనా ఎస్‌పీ శైలేంద్రసింగ్ చెప్పారు. ఓటర్లను పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా ఆపేందుకు ప్రయత్నిస్తుండగా మిర్ఘాన్ గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, అందులో ఇద్దరు గాయపడినట్లు ఎస్‌పీ వివరించారు. కానీ కొన్ని వార్తా చానళ్లు ఈ ఘటనను పెద్దది చేసి చూపుతున్నాయని, పోలీసు కాల్పులు జరిగినట్లు, కొంతమందికి బుల్లెట్ గాయాలైనట్లు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రత్యర్థుల రాళ్ల దాడిలో జబువా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డా.విక్రాంత్ భూరియా భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

రాజస్తాన్‌లో బీజేపీ చెల్లాచెదురు

ప్రియాంక గాంధీ వాద్రా

జైపూర్ : రాజస్తాన్‌లో బీజేపీ చెల్లాచెదురయిందని, రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థే కరవయ్యారని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా శుక్రవారం అన్నారు. ప్రధాని మోదీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో తరచుగా పర్యటించడంపై కూడా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విరుచుకుపడ్డారు. బీజేపీకి ముఖ్యమంత్రి ముఖాన్ని కనుగొనడానికి ఆయన బయలుదేరినట్లు తెలుస్తోందని ఎద్దేవా చేశారు. 'రాజస్థాన్‌లో బీజేపీ చెల్లాచెదురుగా ఉన్న పార్టీ, దానికి ముఖ్యమంత్రి పదవి కోసం అభ్యర్థి లేరు. రాష్ట్రం నలుమూలలా ప్రధాని తిరుగుతున్నారు. కొన్నిసార్లు ఆయన తన ముఖ్యమంత్రి అభ్యర్థి కనుగొనడానికి బయలుదేరినట్లు అనిపిస్తుంది' అని దుంగార్‌పూర్ జిల్లాలోని సగ్వాడలో జరిగిన ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి గాంధీ అన్నారు. 'రాజకీయాల్లో భావోద్వేగాలు, మతాన్ని ఉపయోగిస్తే, ఎవరైనా జాగ్రత్తగా ఉండాలి' అని ఓటర్లను కోరారు.

ద్రవ్యోల్బణం కారణంగా రైతులతో సహా దేశవ్యాప్తంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ నేతృత్వంలోని కేంద్రాన్ని విమర్శిస్తూ గాంధీ అన్నారు. 200 మంది సభ్యులున్న రాజస్తాన్ అసెంబ్లీకి నవంబరు 25న ఎన్నికలు జరగనుండగా, డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది.

ఎన్నికల వేళ

పెరిగిన మద్యం అమ్మకాలు

భోపాల్: ఎన్నికల వేళ మధ్యప్రదేశ్‌లో మద్యం అమ్మకాలు 15శాతం పెరిగాయి. శుక్రవారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా రాష్ట్రంలో బుధవారం సాయంత్రం నుంచి మద్యం విక్రయాలు నిలిపివేశారు. కాగా సోమవారం నుంచి బుధవారం సాయంత్రం వరకు మద్యం విక్రయాలు 15 శాతం పెరిగాయని ఎక్సైజ్ అధికారి ఒకరు తెలిపారు. నవంబర్ 13న దేశంలోని తయారు చేసిన , ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) సహా అన్ని రకాల మద్యం 8,67,282 లీటర్లు విక్రయించబడ్డాయి. తరువాతి రెండు రోజులలో అమ్మకాలు 9,17,823, 8,81,550 లీటర్ల చొప్పున ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది నవంబర్ 13, 14, 15 తేదీల్లో వరుసగా 7,42,092 లీటర్లు, 7,71,331 లీటర్లు, 7,67,273 లీటర్ల చొప్పున మద్యం విక్రయాలు జరిగినట్లు ఆయన వివరించారు. ఏటా మద్యం విక్రయాలు సుమారు 10 శాతం పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎంపీలో రూ.11,700 కోట్లకు మద్యం దుకాణాలు వేలం వేశామని... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిమాండ్ 10 శాతం పెరుగుతుందని అంచనా వేసినందున రూ.12,800కు విక్రయించామని ఆయన చెప్పారు. నవంబర్ 12న దీపావళి కావడంతో మద్యం విక్రయాలు పెరిగాయని చెప్పారు. ఎన్నికల దృష్ట్యా గత మూడు నెలలుగా మద్యం విక్రయాలపై నిఘా ఉంచామని... ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒక దుకాణంలో మద్యం విక్రయాలు 30 శాతం పెరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని 230 అసెంబ్లీ స్థానాలకు శుక్రవారం పోలింగ్‌ను పురస్కరించుకుని నిబంధనల ప్రకారం 48 గంటల ముందుగా మూతబడిన మద్యం దుకాణాలు ఓటింగ్ ముగిసిన తర్వాత తిరిగి తెరుచుకోనున్నాయి.

కళా చరిత్రకారుడు గోస్వామి కన్నుమూత



న్యూఢిల్లీ: ప్రఖ్యాత కళా చరిత్రకారుడు, రచయిత బీఎన్ గోస్వామి (90) శుక్రవారం చండీగఢ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్)లో కన్నుమూశారు. గోస్వామి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతున్నారని ఆయన కుటుంబ స్నేహితురాలు, థియేటర్ ఆర్టిస్ట్ నీలం మాన్‌సింగ్ పీటీఐకి తెలిపారు. ఇది దీర్ఘకాలంగా ఉన్న అనారోగ్యం కాదని... ఆయన నెలరోజులుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఆగష్టు 15, 1933న జన్మించిన గోస్వామి... భారత ప్రభుత్వంచే పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. పహారీ చిత్ర లేఖనంపై రచనలకు ఆయన ప్రసిద్ధి చెందారు. కళారంగంలో ముద్దుగా బీఎన్జీ అని పిలుచుకునే గోస్వామి... పహారీ పెయింటింగ్స్, మినియేచర్ పెయింటింగ్ (సూక్ష్మ చిత్రాలు)లు, కోర్ట్ పెయింటర్లు, భారతీయ పెయింటింగ్‌లలో మాస్టర్స్ విషయాలపై 26కు పైగా పుస్తకాలను రచించారు. గోస్వామి సతీమణి కరుణ కూడా కళా చరిత్రకారిణి. ఆమె 2020లో మరణించారు. గోస్వామికి ఒక కుమార్తె మాళవిక ఉన్నారు.

రాష్ట్రపతితో సక్సేనా, సమారియా భేటీ

న్యూఢిల్లీ: దిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు వినయ్ కుమార్ సక్సేనా, సీఐసీ హీరాలాల్ సమారియా రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో శుక్రవారం సమావేశమయ్యారు. తన భార్యతో కలిసి వినయ్ సక్సేనా రాష్ట్రపతిని కలిశారని రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్ వేదికగా తెలిపింది. ద్రౌముది ముర్ముతో సక్సేనా దంపతుల భేటీకి సంబంధించి ఫొటోనే పోస్టు చేసింది. ముఖ్య సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియా రాష్ట్రపతితో భేటీ అయిన ఫొటోనూ కూడా పోస్టు చేసింది.

పూంచ్‌లో 'ఉపా' నిందితుడి స్థిరాస్తి జప్తు

మెంధార్/జమ్ము : జమ్ముకశ్మీర్‌కు చెందిన పూంచ్ జిల్లాలో 'ఉపా' కేసులో అరెస్టయిన ఒక తెహ్రీక్-ఉల్-ముజాహిదీన్ ఓవర్ గ్రౌండ్ వర్కర్ (ఓజీడబ్ల్యూ) స్థిరాస్తిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం జప్తు చేసినట్లు అధికారులు తెలిపారు.

జప్తు చేసిన ఆస్తిలో బాలాకోట్ సెక్టార్‌లో ఓజీడబ్ల్యూ కార్యకర్తగా క్రియాశీలకంగా ఉన్న మహమ్మద్ యాసీన్‌కు చెందిన ఏడు ఎకరాల కంటే ఎక్కువ భూమిని జప్తు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద నమోదయిన కేసులో ప్రస్తుతం అతను జమ్మూలోని కోట్ బల్వాల్‌లోని కేంద్ర కారాగారంలో ఉన్నారు. సెప్టెంబరు 30న జమ్మూలోని ఎన్ఐఏ కోర్టు ఆదేశాల మేరకు బాలకోట్ తహసీల్‌లోని ధాబి-ధరతి గ్రామంలోని ఆస్తులను జప్తు చేసినట్లు అధికారులు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ బాలాకోట్‌తో పాటు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి.కె.మేగి అధ్వర్యంలో ఎన్ఐఏ బృందం ఈ ఆదేశాలను అమలు చేసింది. ఈ 'ఉపా' కేసు బాలాకోట్ మెంధార్, పూంచ్ వద్ద ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, డ్రగ్స్ స్వాధీనానికి సంబంధించినది. ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఉల్-ముజాహిదీన్ (టీయూఎం)కు చెందిన యాసీన్ నిందితుడుగా ఉన్నాడు.

'సుప్రీం కోర్ట్ క్రానికల్' మాస పత్రిక ఆవిష్కరణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కార్యకలాపాలు, సాధించిన విజయాలు, కోర్టు పనితీరును వివరిస్తూ... 'సుప్రీంకోర్టు క్రానికల్' పేరుతో నెలవారీ పత్రికను అత్యున్న న్యాయస్థానం ప్రారంభించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ శుక్రవారం మొదటి సంచికను ఆవిష్కరించారు. సంగ్రహంగా న్యాయస్థానం చరిత్ర, కీలక తీర్పులపై విశ్లేషణ, న్యాయపరిరక్షణకు విశేష సేవలందించిన వ్యక్తుల కథనాలు ఇందులో ఉన్నట్లు ఆయన తెలిపారు. 'సుప్రీం కోర్ట్ క్రానికల్... సుప్రీంకోర్టు పనితీరు గురించిన సమాచారానికి కీలక వనరుగా మారుతుందని నేను విశ్వసిస్తున్నాను. న్యాయస్థానం లోపల, వెలుపల ఈ కోర్టు కార్యకలాపాలను పాఠకులకు అందిస్తుంది. కోర్టు పనితీరును మెరుగుపరచడానికి చేస్తున్న నిరంతర ప్రయత్నాలను పాఠకులకు తెలియజేస్తుందని నా ఆశ' అని చంద్రచూడ్ పేర్కొన్నారు. సుప్రీం కోర్ట్ క్రానికల్ ప్రచురణకు సహకరించిన కొత్త న్యాయమూర్తుల లైబ్రరీకి, సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్‌లోని వారందరికీ చంద్రచూడ్ కృతజ్ఞతలు తెలిపారు.

చెదురుమదురు ఘటనలు మినహా

పోలింగ్ ప్రశాంతం

మధ్యప్రదేశ్‌లో 71 శాతం, చత్తీస్‌గఢ్‌లో 68 శాతం పోలింగ్

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ నియోజకవర్గాలకు, చత్తీస్‌గఢ్‌లో 70 స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగింది. మధ్యప్రదేశ్‌లో 71.16 శాతం, చత్తీస్‌గఢ్‌లో 68.15 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యప్రదేశ్‌లో సాయంత్రం 6గంటల వరకు, చత్తీస్‌గఢ్‌లో ఐదు గంటల వరకు ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. చత్తీస్‌గఢ్‌లో తుది దశ పోరులో 958 మంది పోటీచేయగా వీరిలో సీఎం భూపేశ్ బాఘెల్, ఉపముఖ్యమంత్రి సింగ్ డియో, ఎనిమిది మంది మంత్రులు, నలుగురు ఎంపీలు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో ఒకే దశలో ఎన్నికలు జరుగగా 2,583 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మొత్తం 5,60,60,925 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండు రాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రధానంగా పోటీ జరిగింది. రెండు వర్గాల మధ్య ఘర్షణలతో అనేకచోట్ల హింసాత్మక వాతావరణం నెలకొంది.

ఎన్నికల వేళ హింస

మధ్యప్రదేశ్‌లోని రాజ్‌నగర్ నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలో కాంగ్రెస్ అభ్యర్థి అనుచరుడు మృతి చెందాడు. ఇండోర్ జిల్లా ఘర్షణలో ఐదుగురు, మొరేనా జిల్లా దిమానీ నియోజకవర్గంలో ఇద్దరు గాయపడ్డారు. రాజ్ నగర్‌లో ఇద్దరు నాయకుల అనుచరుల మధ్య ఘర్షణలో సల్మాన్ అనే వ్యక్తి మృతి చెందారు. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన విక్రమ్‌సింగ్ అలియాస్ నటీరాజా స్పందిస్తూ బీజేపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగానే గొడవ సృష్టించి సల్మాన్‌ను చంపారన్నారు. ఇది కుట్రని, దీనిపై విచారణ చేయాలని బీజేపీ అభ్యర్థి అరవింద్ పటేరియా ఎదురుదాడికి దిగారు. అత్యంత సున్నితమైన మొరేనా జిల్లా సుమవాలీ నియోజకవర్గంలో పోలింగ్ శాంతియుతంగా జరిగేందుకు సహకరించాలని, బీజేపీ అభ్యర్థి అందల్‌సింగ్ కన్సానా, కాంగ్రెస్ అభ్యర్థి అజబ్ సింగ్ కుశ్వాహా, బీఎస్పీ అభ్యర్థి కుల్దీప్ సింగ్ సికర్వార్‌లకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. ముగ్గురు అభ్యర్థులను ముందే పిలిచి మాట్లాడామని, సహకరిస్తామని వారు హామీ ఇచ్చారని మొరేనా ఎస్పీ శైలేంద్రసింగ్ చెప్పారు. ఓటర్లను పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా ఆపేందుకు మిర్ధాన్ గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, అందులో ఇద్దరు గాయపడ్డారని ఎస్పీ తెలిపారు. పోలీసు కాల్పులు జరిగినట్లు, కొందరికి బుల్లెట్ గాయాలైనట్లు దుష్ప్రచారం జరిగిందన్నారు. ప్రత్యర్థుల రాళ్ల దాడిలో జబువా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డా.విక్రాంత్ భూరియా భద్రతా సిబ్బంది గాయపడ్డారు. అటు చత్తీస్‌గఢ్‌లోనూ హింస జరిగింది. నక్సల్ దాడిలో ఐటీబీపీ జవాన్ మరణించారు. క్యూలైన్‌లో ఉన్న మహిళ కుప్పకూలిపోగా మరో వ్యక్తి ఏనుగు దాడిలో ప్రాణాలు కోల్పోయారు. గారియాబంద్ జిల్లాలో బడే గోబ్రా గ్రామం వద్ద జరిగిన పేలుడు ఐటీబీపీ హెడ్ కానిస్టేబుల్ జోగిందర్ సింగ్ అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఓటింగ్ తర్వాత పోలింగ్ బృందాన్ని భద్రతా సిబ్బంది తరలించే క్రమంలో ఈ ఘటన జరిగినట్లు సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. మిగతా బృందం క్షేమంగా మెయిన్‌పూర్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నదన్నారు. బాలాడా బజార్-భతాపారా జిల్లాలోని కాస్‌డోల్ నియోజవకర్గంలోని బూత్ వద్ద క్యూలో ఉన్న మహిళ ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు వదిలారు. ఆమె మరణానికిగల కారణాలు తెలియలేదు. ఈ ఘటనను రిటర్నింగ్ అధికారి భూపేంద్ర అగర్వాల్ ధ్రువీకరించారు. మృతురాలిని సహోదరా బాయి నిషాద్(58)గా గుర్తించామన్నారు. క్యూలో ఉన్న ఆమె స్పృహ కోల్పోవడంతో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తీసుకెళితే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. కొరియా అటవీ ప్రాంతంలోని మాన్‌గోవా గ్రామం సమీపంలో జరిగిన ఏనుగు దాడిలో ఓటేసేందుకు వెళ్లే ఉమేంద్ర సింగ్ (25) చనిపోయినట్లు అటవీ అధికారి ఒకరు తెలిపారు.

ఓటేసిన ప్రముఖులు

చత్తీస్‌గఢ్ సీఎం బాఘెల్ పటన్ దుర్గ్ జిల్లాలోని కురుద్ది గ్రామంలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఆయన సతీమణితో కలిసి సివిల్ లైన్స్ రాయ్‌పూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపముఖ్యమంత్రి సింగ్ డియో అంబికాపూర్‌లో, మంత్రులు రవీంద్ర చౌబే (సజా సీట్), అనిలా భేడియా (డొండిలాహరా), అమర్‌జిత్ భగత్ (సీతాపూర్), జైసింగ్ అగర్వాల్ (కోర్బా), స్పీకర్ చరణ్‌దాస్ మహంత్ (శక్తి)లో ఓటేశారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ఓటు హక్కును సిహోరేలో వినియోగించుకోగా ఛింద్వారాలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్ ఓటేశారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయవర్గీయ, రాష్ట్ర హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా, క్రీడా మంత్రి యశోధర రాజే సింధియా, రాష్ట్ర సీఈవో అనుపమ్ రాజన్, కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ తనయుడు, మాజీ మంత్రి జైవర్ధన్ సింగ్ తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికలను బహిష్కరించిన ఛింద్వారా ప్రజలు

స్థానిక నాయకుడికి మరొక స్థానం నుంచి టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ నిరాకరించడానికి నిరసనగా మధ్యప్రదేశ్, ఛింద్వారా అసెంబ్లీ నియోజకవర్గం ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. షాపూర్‌కు చెందిన నీరజ్ బంటీ పటేల్‌కు చౌరాయి స్థానం నుంచి టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అంగీకరించకపోవడంతో పోలింగ్‌ను బహిష్కరించాలని నిర్ణయించినట్లు స్థానికుడు దౌలత్ సింగ్ తెలిపారు. చౌరాయి స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పటేల్ పోటీ చేసినట్లు చెప్పారు. కోట్వర్ గోపాల్ తప్ప గ్రామంలోని 1,063 మందిలో ఎవరూ ఓటు వేయలేదని ఎన్నికల అధికారి రమేశ్ గాడ్జే వెల్లడించారు. ఇది కమల్‌నాథ్ సొంత నియోజవర్గం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

హాట్‌కేకుల్లా టీ 20 క్రికెట్ టికెట్లు

ఎగబడిన క్రీడాభిమానులు

విశాలాంధ్ర- పీఎం పాలేం (విశాఖ): భారత్-ఆస్ట్రేలియా మధ్య విశాఖ వేదికగా ఈ నెల 23వ తేదీన జరగనున్న టీ 20 మ్యాచ్‌కు ఆఫ్ లైన్ టికెట్ల విక్రయం శుక్రవారం భారీ పోలీస్ భద్రత మధ్య ప్రారంభమైంది. 23న పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్ల విక్రయం పూర్తి కాగా, శుక్రవారం ఆఫ్‌లైన్‌లో టికెట్లు అమ్మకాలు సాగించారు. టికెట్ల కోసం కౌంటర్ల వద్ద యువత ఎగబడ్డారు. మధుర వాడలోని క్రికెట్ స్టేడియంతో పాటు వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, గాజువాకలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో టికెట్ల విక్రయం సాగింది. రూ.600, 1,500, 2,000, 3,000, 5,000 టికెట్లు అందుబాటులో ఉంచారు. టికెట్లు కొనుగోలు చేసేందుకు పెద్దఎత్తున యువత అక్కడికి చేరుకున్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. త్వరితగతిన టికెట్లు దక్కించుకునేందుకు కొందరు యువకులు గురువారం రాత్రి స్టేడియాల వద్దే నిద్రపోయారు. మహిళలు సైతం శుక్రవారం వేకువజాము నుంచే క్యూలైన్లకు చేరుకొని టికెట్ల కోసం పోటీపడ్డారు. ఇప్పటికే ప్రపంచ కప్ క్రికెట్ ఫీవర్ నెలకొన్న నేపథ్యంలో ఆస్ట్రేలియాతో వరల్డ్ కప్‌లో ఆదివారం భారత్ విజయం ఖాయమని భారీ బెట్టింగులు కాస్తున్న క్రికెట్ అభిమానులు, విశాఖ వేదికగా జరగనున్న టీ 20 మ్యాచ్ వీక్షణ కోసం అదేస్థాయిలో పోటీ పడుతున్నారు.

'జగన్మోహనం-అభివృద్ధిపథంలో ఆంధ్రప్రదేశ్'

పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి ధర్మాన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'జగన్మోహనం-అభివృద్ధిపథంలో ఆంధ్రప్రదేశ్' అనే పుస్తకాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మైండ్ పవర్ లో ప్రపంచ రికార్డు గ్రహీత డా.తాటికొండ వేణుగోపాల్ రెడ్డి, ప్రముఖ రచయిత విజయార్కెలు ఈ పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతిభా విశేషాలను, చాతుర్యాన్ని, ఆలోచనా ధోరణిని, పరిపాలనా తీరును, వ్యక్తిత్వం, పట్టుదల తదితర అన్ని విషయాలను ఎంతో కూలంకషంగా అధ్యయనం చేయడమే కాకుండా ఆ విషయాలను సరళంగా అందరికీ అర్థమయ్యే విధంగా అంశాల వారీగా గ్రంథస్థం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఏ రంగంలోనైనా సమర్థంగా పనిచేసే వ్యక్తులను చూడటం సామాన్యమైన విషయమని, అయితే అలా చూసిన విషయాలను గ్రంథస్తం చేసి ఇతరులు చదివి ఆ విషయాలను అర్థం చేసుకునే విధంగా అవకాశం కల్పించడం అనేది ఒక గొప్ప ప్రయత్నమన్నారు. ఈ దిశలో 75 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం పరిపాలనలో అనేక కొత్త ఒరవడులను, విధానాలను రాజ్యాంగబద్ధంగా అమలు చేస్తున్న ఒక ముఖ్యమంత్రి గురించి ప్రస్తుత, భావి తరాలు తెలుసుకునేందుకు రచించిన ఈ పుస్తకం ఎంతో దోహపడుతుందన్నారు.

సబ్ రిజిస్ట్రార్ నివాసంలో ఏసీబీ సోదాలు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సింగ్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొంటూ కార్యాలయంలో మద్యం సేవిస్తూ వార్తల్లోకెక్కిన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ సింగ్ గొల్లపూడిలో నివాసం ఉంటుండగా శుక్రవారం ఉదయం నుండి ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌమ్య లత అధ్వర్యంలో అతని నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నారు. అయితే పూర్తి వివరాలు సోదాలు పూర్తయిన తర్వాత మాత్రమే వెల్లడిస్తామని తెలిపారు.

కశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఆరుగురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్లో భద్రతా దళాలకు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతిచెందిన వారిని లష్కరేతోయిబా ఉగ్రసంస్థకు చెందినవారిగా అధికారులు గుర్తించారు. కశ్మీర్లోని కుల్గాం జిల్లాలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. జమ్ముకశ్మీర్ కుల్గాం జిల్లా నెహామా ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కారన్న సమాచారం భద్రతా బలగాలకు గురువారం అందింది. దీంతో పోలీసులు, సీఆర్పీఎఫ్, ఆర్మీకి చెందిన 34 రాష్ట్రీయ, రైఫిల్స్ బృందాలు, 9 పారామిలటరీ బృందాలు ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఈ క్రమంలో తనిఖీలు జరుపుతున్న భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో గాలింపు కాస్తా ఎన్‌కౌంటర్‌గా మారింది. గురువారం రెండువైపుల నుంచి పెద్ద ఎత్తున కాల్పులు జరిగాయి. రాత్రి వేళ కాల్పులకు విరామం ఇచ్చిన భద్రతా సిబ్బంది... ఆ ప్రాంతం నుంచి ఉగ్రవాదులు తప్పించుకోపోకుండా పహారా కాశారు. అయితే శుక్రవారం ఉదయం ఓ ఇంట్లో నుంచి ముష్కరులు భద్రతా సిబ్బం దిపై కాల్పులు జరిపారు. వారి కాల్పులకు భద్రతా బలగాలు దీటుగా స్పందించాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు ఉగ్రవాదులు హతమైనట్లుగా అధికారులు ధ్రువీకరించారు. కాల్పుల్లో చనిపోయిన ఐదుగురు లష్క రేతోయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన వారని గుర్తించారు. 'కుల్గాం ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం ఇంటెలిజన్స్ విభాగం నుంచి మా భద్రతా బలగాలకు అందింది. సెర్చ్ ఆపరేషన్ జరుగుతున్న సమయంలో ఓ ఇంటి నుంచి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. వారిపై మా భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు హతమయ్యారు' అని కశ్మీర్ ఐజీపీ విధి కుమార్ బిర్ది వెల్లడించారు. డ్రోన్ల ద్వార ఐదుగురు ఉగ్రవాదుల మృతదేహాలను గుర్తిం చామని... వాటిని వెలికితీసి ఆ ప్రాంతాన్ని శానిటైజ్ చేస్తున్నామని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. అయితే ఉగ్రవాదుల ఏరివేత ఇంకా కొనసాగుతోందని అధికారులు చెప్పారు.

ప్రపంచ కప్‌కు ముందు 'సూర్యకిరణ్' ఎయిర్‌షో

అహ్మదాబాద్: ప్రపంచ కప్ ఫైనల్స్‌కు ముందు ఐఏఎఫ్ సూర్యకిరణ్ బృందం ఎయిర్‌షో ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతోంది. క్రికెట్ ప్రపంచ కప్ తుది పోరు ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరగనుంది. ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా ఉంటుందన్న అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో గుజరాత్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో ఎయిర్‌షో నిర్వహణ అంచనాలను మరింత పెంచుతోంది. ఎయిర్‌షో కోసం శుక్ర, శనివారాలలో రిహార్సెల్స్ జరుగుతాయని గుజరాత్ రక్షణ పీఆర్ఓ ప్రకటించింది. శనివారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. సూర్య కిరణ్ ఎయిరోబాటిక్ బృందం పది నిమిషాల పాటు నరేంద్రమోదీ మైదానంలో వైమానిక ప్రదర్శన ద్వారా ప్రక్షేకులను అలరించనున్నట్లు ప్రకటన పేర్కొంది. సూర్యకిరణ్ ఎయిరోబాటిక్ బృందంలో మొత్తం తొమ్మిది విమానాలు ఉంటాయి. విక్టరీ ఫార్మేషన్, బ్యారల్ రోల్‌తో పాటు అనేక ఆకారాలను సృష్టించడం ద్వారా అద్భుత వైమానిక ప్రదర్శనను ఈ బృందం ఇవ్వనుంది. సూర్యకిరణ్ బృందాన్ని ఐఏఎఫ్‌కు రాయబారులుగా వ్యవహరిస్తారు. కర్నాటక, బీదర్‌కు చెందిన ఈ బృందంలోని తొమ్మిది హాక్ ఎంకే 132 విమానాల విన్యాసాలు అబ్బురపర్చబోతున్నాయి.

త్వరలో 'జొరావర్' పరీక్షలు

హిమాలయాల్లో పహారాకు యుద్ధట్యాంకర్లు సిద్ధం

చండీగఢ్: హిమాలయ సరిహద్దు ప్రాంతాల్లో మోహరింపునకు దేశీయ పరిజ్ఞానంతో తయారైన తేలికపాటి యుద్ధ ట్యాంక్ 'జొరావర్' సిద్ధమవుతోంది. ఇదే క్రమంలో ఈ ట్యాంకును పరీక్షించనున్నారు. ఈనెలాఖరులోగా దీనిని పరీక్షించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 25 టన్నుల జొరావర్ ట్యాంక్ నీటిలో, అధిక ఎత్తులో ప్రయాణించగలదు. వాయు మార్గంలో దీనిని రావాణా చేయొచ్చు. డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ కలిసి డిజైన్ చేసిన ఈ యుద్ధ ట్యాంకులో కృత్రిమ మేధస్సు ఆధారిత రక్షణ వ్యవస్థ కూడా ఉంది. భారత సైన్యం కోసం జొరావర్ రూపుదిద్దుకుంది. 2020 మేలో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ)తో ఘర్షణ క్రమంలో లధక్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి తేలికపాటి ట్యాంకులు వినియోగించాలని తొలుత భావించారు. పీఎల్ఏ 30-33 టన్ జెట్‌టీక్యూ 105/టైప్ 15 తేలికపాటి ట్యాంకర్లు ఇందుకు అనుకూలంగా ఉంటాయని భావించారు. ఏడు తేలికపాటి ట్యాంక్ రెజిమెంట్లను సైన్యంలో ప్రవేశపెట్టాలన్న లక్ష్యం ఉంది. చైనాకు చెందిన తేలికపాటి ట్యాంకులకు మూడువేల రేంజ్‌గల 105 ఎంఎం తుపాకీ అమరివుంటుంది.

నూహ్‌లో మళ్లీ ఉద్రిక్తత

పిల్లల రాళ్లదాడిలో 8 మంది మహిళలకు గాయాలు

చండీగఢ్: హరియాణాలోని నూహ్‌లో మళ్లీ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పిల్లలు జరిపిన రాళ్ల దాడుల్లో ఎనిమిది మంది మహిళలు గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత జులైలో నూహ్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షలు జరిగిన తర్వాత తాజా ఘటన ఆందోళన కలిగిస్తోంది. ఎనిమిది మంది మహిళలు వెళ్తుండగా పిల్లలు వారిపై రాళ్లతో దాడి చేశారనీ, ఈ ఘటన గురువారం రాత్రి 8:20 సమయంలో జరిగిందని నూహ్ ఎస్పీ నరేంద్ర బిజర్నియా తెలిపారు. నిందితులను ఇప్పటికే గుర్తించామనీ, ఈ ఘటన సాకుగా ఆందోళనలు చెలరేగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం పరిస్థితులు అదుపులోనే ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది జులై 31న నూహ్ జిల్లాలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. విశ్వ హిందూ పరిషత్ యాత్ర చేపట్టిన నేపథ్యంలో అల్లరిమూకలు రాళ్లు విసిరారు. దీంతో భారీ స్థాయిలో ఆందోళనలు జరిగాయి. ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నిరసనలు పక్కనే ఉన్న గురుగ్రామ్, ఢిల్లీ ప్రాంతాలకు వ్యాపించాయి.

ప్రదర్శన అగ్రభాగాన జయలక్ష్మి, దుర్గాభవాని, సంధ్య, వనజ, విమల తదితరులు

బహిరంగ సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల. వేదికపై పెంచలయ్య, బషీరున్నీసా, సంధ్య, జయలక్ష్మి, వనజ, దుర్గాభవాని, విమల, రాణి, రామాంజనేయులు, గిద్దయ్య తదితరులు

నంద్యాల మహిళా మహాసభ దృశ్యమాలిక

మహిళా వలంటీర్ల కవాతు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.